మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 62 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri

బుధవారం 22 మే 2024

పారిశ్రామిక అభివృద్ధిలో ముందుండాలి

తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి ఆరు సూత్రాలు

- ప్రపంచంతో పోటీ పడేలా విధానాలు రూపొందించాలి
- తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ఆరు కొత్త పాలసీలు
- కార్మికులకు ఉపయోగపడేలా పవర్‌లూమ్, హ్యాండ్‌లూమ్ పాలసీ
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్, (ప్రజా మంటలు): పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడేలా విధానాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు సంబంధించి మంగళవారం అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన నూతన విధానాలపై పలు సూచనలు చేశారు. గత సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, పనుల్లో పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. టెక్స్ టైల్స్‌కు సంబంధించి రాష్ట్రంలోని పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ కార్మికులకు ఉపయోగ పడేలా కొత్త పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

మిగతా 2లో..

సరికొత్తగా తెలంగాణ రాష్ట్రగీతం

- జూన్2న దశాబ్ది ఉత్సవాల్లో ఆవిష్కరణ
- అందెశ్రీ రాసిన గీతంలో స్వల్ప మార్పులు
- ఓకే చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి
- సంగీత దర్శకుడు కీరవాణి కంపోజ్

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్ర గీతంపై ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన గీతాన్ని స్వల్ప మార్పులతో స్వరపరిచారు. తెలంగాణ అవతరణ

మిగతా 2లో..

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

- ఘనంగా నివాళి అర్పించిన సీఎం రేవంత్

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రధానిగా ఐటీ రంగ వృద్ధికి రాజీవ్ గాంధీ బాటలు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. నగరంలోని సోమాజిగూడలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి, వి.హనుమంతరావు, షబ్బీర్ అలీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కడి న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూటమిదే అధికారం

- కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు పక్కా: ఖర్గే

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): దేశ వ్యాప్తంగా ఐదు విడతల పోలింగ్ ముగిసే నాటికి విపక్ష కూటమి బలంగా పుంజుకొందని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రాజ్యాంగానికి ముప్పు, ప్రజాస్వామ్యంపై దాడి వంటివే ప్రధాన అంశాలుగా ఎన్నికలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఆయన ఓ ఆంగ్లపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించారు. 2019 ఎన్నికలతో పోలిస్తే 2024లో తాము ప్రతి రాష్ట్రంలో బాగా మెరుగుపడినట్లు ఖర్గే తెలిపారు. భాజపాను ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా అడ్డుకొంటామన్న విశ్వాసం ఉందన్నారు. ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని.. తాము వారికి సాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇక బిహార్‌లో కాంగ్రెస్-ఆర్జేడీ కలిసి భాజపా భావజాలంపై పోరాడుతున్నాయని వెల్లడించారు. దళిత, వెనుకబడిన వర్గాలు బలంగా తమ కూటమికి మద్దతు పలుకతున్నాయన్నారు. ఇక యూపీలో 2019లో ఎస్పీ, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీచేయడంతో నాడు బలహీనపడినట్లు అంచనావేశారు. ఈ సారి ఇరు పార్టీల నేతలు కలిసి ప్రచారం చేయడం

మిగతా 2లో..

కవితపై ఈడీ ఛార్జిషీటు

- తీర్పువాయిదా

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటుపై మంగళవారం విచారణ ముగిసింది. ఈడీ దాఖలు చేసిన ఏడవ సప్లిమెంటరీ ఛార్జిషీట్‌పై ప్రత్యేక న్యాయస్థానం విచారణ జరిపింది. 8 వేల పేజీలతో కూడిన ఛార్జిషీటును ఈడీ దాఖలు చేసింది. ఎమ్మెల్సీ కవిత సహా 5 మంది నిందితులపై ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకునే అంశంపై వాదనల అనంతరం తుది ఉత్తర్వులను కోర్టు వాయిదా వేసింది. ఈ నెల 29న ఉత్తర్వులు వెలువరించనున్నట్లు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కావేరి బవేజా తెలిపారు. మరోవైపు ఈ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్‌కు వ్యతిరేకంగా ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పై ఈ నెల 28న వాదనలు మొదలుకానున్నాయి.

చివరి గింజవరకూ కొంటాం

- తడిసిన, మొలకెత్తిన ధాన్యం కూడా సేకరిస్తాం
- కొనుగోళ్లపై దుష్ప్రచారం సరికాదు
- అబద్ధాలతో రైతులను ఆందోళనకు గురిచేస్తే ఊరుకోం
- వరివేస్తే ఉరే.. అన్నవారా విమర్శించేది!
- సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో మొదలు పెట్టాం
- బీఆర్ఎస్, బీజేపీలపై మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్, (ప్రజా మంటలు): ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారం మానుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే కావాలని దుష్ప్రచారాలు చేయడం, అబద్ధాలు చెప్పడం అలవాటుగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి గింజ వరకు వడ్లు కొంటామని ఈ సందర్భంగా భట్టి వెల్లడించారు. గత బిఆర్ఎస్ సర్కార్ రైతులను పట్టించుకోలేదని, ప్రచారార్భాటాలు మాత్రం దండిగా చేసిందని విమర్శించారు. వరివేస్తే ఉరి అన్నవారా విమర్శలు చేసేదని మండిపడ్డారు. సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో మొదలు పెడతామని చెప్పారు. రైతుల పేరు మీద రాజకీయాలు చేయొద్దని ఆ రెండు పార్టీల నేతలకు ఆయన సూచించారు. స్వార్థ రాజకీయాల కోసం రైతులను వాడుకుంటున్నారని ఆగ్రహించారు. గత సర్కార్ తడిసిన వడ్లను కొనలేదని విమర్శించారు. తాము తడిసిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ రేటుకే కొంటున్నామని తెలిపారు. 15 రోజుల ముందు నుంచి వడ్లు కొనుగోలు పక్రియ ప్రారంభించామని చెప్పారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం బీఆర్ఎస్ బీజేపీ నేతలు అడ్డగోలుగా మాట్లాడొద్దని సూచించారు. గత బిఆర్ఎస్ మోసం చేసిన

మిగతా 2లో..

భారత భద్రత ప్రయోజనాలను కట్టుబడి ఉన్నాం

- శ్రీలంక

కొలంబో (ప్రజా మంటలు): భారత భద్రతకు ముప్పు తలపెట్టే చర్యలను తాము అనుమతించబోమని శ్రీలంక విదేశాంగ మంత్రి అలీ సబ్రీ అన్నారు. పొరుగు దేశంగా అది తమ బాధ్యత అని స్పష్టం చేశారు. భారత భద్రత ప్రయోజనాలను పరిరక్షించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. శ్రీలంక తీరాలకు చైనా పరిశోధక నౌక చేరడంపై భారత్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలపైనా సబ్రీ స్పందించారు. తాము ఇతర దేశాలతో చాలా పారదర్శకంగా పనిచేస్తామని.. పొరుగు వారికి నష్టం కలిగించే చర్యలకు ఏమాత్రం ఆమోదం

ప్రజా నాడి



ఎండల నుంచి ఉపశమనం

- రాష్ట్రవ్యాప్తంగా చల్లబడ్డ వాతావరణం , మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. భారీ ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగింది. గత రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అయితే మరో రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం రోజు నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, నారాయణపేట్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులు వీస్తూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. కాగా ద్రోణి కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు సముద్ర మట్టం నుంచి విస్తరించిందని వివరించింది. ఆకాశం మేఘావృతమై ఉండనుందని వాతావరణ శాఖ తెలిపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఏసీపీ నివాసంలో నోట్ల గుట్టలు

- ఆదాయానికి మించి ఆస్తులు
- సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు సోదాలు

హైదరాబాద్, (ప్రజా మంటలు): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు ఇళ్లలో అనిశా అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. 12 గంటలుగా ఎనిమిది చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. అశోక్‌నగర్‌లో ఉన్న ఆయన నివాసం, అదే అపార్ట్‌మెంట్లో ఉన్న మరో రెండు ఇళ్లు, సీసీఎస్ కార్యాలయం, నగరంలోని మరో ఇద్దరు స్నేహితుల ఇళ్లు, ఆంధ్రప్రదేశ్‌లో రెండు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. సోదాల్లో ఇప్పటి వరకు అధికారులు పలు కీలక డాక్యుమెంట్లతో పాటు రూ.40లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాలు,

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

పారిశ్రామిక అభివృద్ధిలో ముందుండాలి

ఎంఎస్ఎం ఈ, ఎగుమతులు, లైఫ్ సైన్సెస్, మెడికల్ టూరిజం, గ్రీన్ ఎనర్జీ, ఈవీ పాలసీలకు సవరణ చేస్తున్నట్టు వెల్లడించారు. టెక్స్ టైల్స్ రంగానికి సంబంధించి పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ కార్మికులకు ఉపయోగ పడేలా కొత్త పాలసీని రూపొందించాలని అధికారులకు సీఎం సూచించారు. ప్రపంచ దేశాల్లోని అత్యుత్తమ పాలసీలను అధ్యయనం చేయాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడేలా నూతన పాలసీలు ఉండాలని రేవంత్ రెడ్డి అన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి కొత్తగా ఆరు పాలసీలను రూపొందించనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీ, ఎక్స్ పోర్ట్ పాలసీ, న్యూ లైఫ్ సైన్సెస్ పాలసీ, రివైజ్డ్ ఈవీ పాలసీ, మెడికల్ టూరిజం పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలను రూపొందిస్తుమన్నామని సీఎంకు వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసేలోగా పారిశ్రామిక పాలసీలను పూర్తిస్థాయిలో రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రపంచ దేశాల్లో ది బెస్ట్ పాలసీలను అధ్యయనం చేయాలని సూచించారు. పారిశ్రామికాభివృద్ధి రాష్ట్ర ప్రయోజనాలను మెరుగు పరుస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పలువురు పాల్గొన్నారు.

చివరి గింజవరకూ కొంటాం

మాదిరిగా కాకుండా...వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే రాజకీయాలు చేయడం అలవాటు కనుక ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అబద్దాలు చెప్పడం భారాస నేతలకు అలవాటన్నారు. 15 రోజుల ముందుగానే ధాన్యం కొంటున్నట్లు వివరించారు. గతం కంటే ఎక్కువగా 7,215 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని అప్పటి ప్రభుత్వం కొనలేదని గుర్తు చేశారు. 'చివరి గింజ వరకూ కొంటాం.. రైతులు ఆందోళన చెందవద్దని భట్టి భరోసా ఇచ్చారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యానికి కూడా ఎంఎస్పీ ఇచ్చి తీసుకుంటాం. ధాన్యం రైతులకు మూడు రోజుల్లోనే డబ్బు అందిస్తున్నాం. వర్షసూచనపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలి. రూ.500 బోనస్ సన్న ధాన్యానికే అని విపక్షాలు విమర్శిస్తున్నాయి. రూ.500 బోనస్ అనేది సన్న ధాన్యం నుంచి మొదలుపెట్టాం' అని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో వరి కొనుగోళ్ల విషయంలో రైతులు) ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధాన్యం తడిసినా, చివరకు మొలకెత్తిన గింజలు కూడా కొంటామని వెల్లడించారు. రేటు తగ్గించకుండా కొంటామని అన్నారు. దీంతోపాటు వరి ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ఈ అంశం ప్రతిపక్షాలకు రుచించడం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులను ఇబ్బంది పెట్టేందుకు రాజకీయాలను వాడొద్దని ప్రతిపక్షాలకు డిప్యూటీ సీఎం హితవు పలికారు. రాష్ట్రంలో అసలు ధాన్యమే కొనుగోలు చేయడం లేదు, కల్లాళ్లలోనే ధాన్యం తడిసి ముద్దవుతుందని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. అందులో నిజం లేదని చెప్పారు. గత ఏడాది ఇదే సమయంలో తాను పాదయాత్ర చేస్తుండగా రోడ్ల వెంట ధాన్యం కుప్పలుగా పోసి రైతులు ఇబ్బంది పడేవారని భట్టి గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం గత ప్రభుత్వం కంటే 15 రోజులు ముందుగానే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ మాదిరిగా కాకుండా మీకంటే ఎక్కువ కేంద్రాల్లో 7,245 కొనుగోళ్లను ప్రారంభినట్లు స్పష్టం చేశారు. ఎన్ని టన్నుల ధాన్యం పండినా కూడా కొంటామని స్పష్టం చేశారు. ఇక ధాన్యం బోనస్ విషయానికి వస్తే సన్న బియ్యానికే రూ. 500 బోనస్ అనలేదని, సన్నాలతో 500 రూపాయల బోనస్ పక్రియను మొదలు పెట్టామని చెప్పారు. నాటి సీఎం కేసీఆర్ వరి వేస్తే ఊరే అని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న రైతు అనుకూల నిర్ణయాలు ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదని భట్టి అన్నారు. రైతుల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు పెరగడంతో ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా తప్పుడు సమాచారం ప్రజల్లోకి తీసుకెళ్లవద్దని కోరారు.

సరికొత్తగా తెలంగాణ రాష్ట్రగీతం

జరిగి పదేళ్లు కావస్తున్నందున పదేళ్ల సంబరాల్లో భాగంగా జూన్ 2వ తేదీన ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీతో ఈ గీతాన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతానికి కొన్ని మార్పులు చేశారు. ఒకటిన్నర నిమిషం నిడివిలో ఈ గీతం సిద్ధం అవుతోంది. సినీ సంగీత దర్శకుడు కీరవాణితో ఈ పాటను రేవంత్ ప్రభుత్వం కంపోజింగ్ చేయించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న.. ఇంత వరకు రాష్ట్రం గీతం లేకుండా పోయింది. గతంలో జరిగిన కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం గీతంపై కీలక నిర్ణయం తీసు కున్నది. ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా తీసుకు రానున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణకు ప్రత్యేక రాష్ట్ర గీతం ఉండాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గతంలో అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతాన్ని అమోదిస్తూ కేబినెట్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే తెలంగాణ ఉద్యమం కంటే ముందు ఈ గీతాన్ని రచించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కొన్ని మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే ఆ గీతం రాసిన అందెశ్రీకి కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వం సూచించింది. అందులో భాగంగా అందెశ్రీ ఈ గీతంలో మార్పులు చేసి ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం అమోదముద్ర వేసింది. ఆ గీతాన్ని సినీ సంగీత దర్శకుడు కీరవాణితో కంపోజింగ్ చేశారు. జూన్2న రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో.. ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుంది. ఈ కార్యక్రమానికి సోనియా గాంధీని చీఫ్ గెస్ట్‌గా పిలవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. నిన్న నిర్వహించిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సోనియాగాంధీ చేతుల మీదుగా తెలంగాణ గీతాన్ని విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణ గీతాన్ని వినిపించారు. ఈ గీతం చాలాబాగుందని రేవంత్ కితాబిచ్చారు. అయిదారు చరణాలతో పూర్తి గీతం ఉంటుంది. ఇందులో ఉన్నటువంటి రెండు చరణాలను మాత్రమే రాష్ట్రం గీతంగా ప్రకటించారు. ఈ రెండు చరణాల్లో తెలంగాణ అవిర్భావం ఎలా జరిగింది, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుకొచ్చేలా రాష్ట్ర గీతం ఉండనున్నది. జూన్2న రాష్ట్ర ప్రజలకు అంకితం చేయనున్నారు. ఆ తర్వాత రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక సమావేశాల సమయాల్లో తెలంగాణ గీతాన్ని ఆలపించే అవకాశం ఉంది.

నోటిఫికేషన్ లేకుండా 30వేల ఉద్యోగాలా!

- అది ఎలా సాధ్యమైంది? కేటీఆర్
- నిరుద్యోగుల పాలిట శాపంగా కాంగ్రెస్ విధానాలు
- ఉద్యోగాలు లేవు..నిరుద్యోగ భృతి కానరాదు
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో కేటీఆర్

నల్లగొండ (ప్రజా మంటలు):

ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి 30వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. నల్గొండ జిల్లా హాలియాలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. గత పదేళ్లలో భారాస ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు అమలు చేసిందన్నారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేసుకోవాలన్నారు. "అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1.8శాతం ఓట్ల తేడాతో అధికారం కోల్పోయాం. భారాస ప్రభుత్వం పనిచేసి కూడా చెప్పుకోలేకపోయింది. నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ పార్టీ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖమ్మం- వరంగల్ -నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఖమ్మం ? నల్లగొండ ? వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 4 లక్షల 70 వేల మంది పట్టభద్రులు ఉన్నారు. మరి అరచేతిలో వైకుంఠం చూపెట్టి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా..? పదేండ్ల పాటు నిజాయితీగా పని చేసిన బీఆర్ఎస్‌కు ఓటెద్దామా..? ఒక గోల్డ్ మెడల్ సాధించి ప్రజాసేవకు అంకితమైన రాకేశ్ రెడ్డికి ఓటేద్దామా..? మీడియా, యూట్యూబ్ అడ్డం పెట్టుకుని దందాలు చేసే చీటర్లకు ఓటేద్దామా..? అనేది ఆలోచించాలని పట్టభద్రులకు కేటీఆర్ సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. జాబ్ క్యాలెండర్ లేదు. మెగా డీఎస్సీ ముచ్చటనే లేదు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ అంటున్నాడు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. ఉద్యోగాలు ఇచ్చామని డైలాగులు కొడితే నమ్మేందుకు మనం పిచ్చొళ్లామా..? కాంగ్రెస్ చెప్పిన 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు. మీ తరపున కొట్లాడాలి అంటే మాకు బలమివ్వాలి. కానీ బాకాలు ఊదేవాళ్లకు కాదు అని కేటీఆర్ చెప్పారు. ప్రభుత్వం ఐదు నెలల్లో అన్ని వర్గాలను మోసం చేసింది. ఐదు నెలల్లోనే ఐదేండ్ల అపఖ్యాతిని మూటగట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. బ్రహ్మాండంగా ఉన్న పరిస్థితిని చెడగొట్టుకున్నామని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పుడైనా ఆలోచించి ఓటేయండి.. ఆగం కాకండి. ఎవరి వల్ల లాభం జరుగుతదో ఆలోచించాలి. బ్లాక్ మెయిలర్లు, దందాలు చేసేటోళ్లకు అవకాశం ఇస్తే సమాజానికి తీవ్ర నష్టం. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్న సన్నాసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే గ్రాడ్యుయేట్లు సరైన తీర్పునివ్వాలి. ఈ ఎన్నికల్లో రాకేశ్ రెడ్డికి ఆశీర్వాదం ఇస్తే ప్రభుత్వం నిలదీసే అవకాశం ఉంటుంది అని కేటీఆర్ అన్నారు.

బోనస్ ఓ బోగస్

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విమర్శించారు. ప్రచారంలో ప్రతిగింజకు బోనస్ అని ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే అంటారా? అని ప్రశ్నించారు. ఇది కపట కాంగ్రెస్ మార్కు మోసం, దగా, నయవంచన అన్నారు. నీరివ్వరు.. కరెంట్ ఇవ్వరు.. పంట కూడా సరిగా కొనుగోలు చేయరా? అని నిలదీశారు. రూ.15 వేలు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఏం అయ్యాయన్నారు. నమ్మి ఓట్లేస్తే గొంతు కోస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్లలెప్లలెనా ప్రశ్నిస్తారు.. రైతన్నలతో కాంగ్రెస్ కౌంట్‌డౌన్ మొదలైందని పేర్కొన్నారు. ఆ పార్టీది ఓట్ల నాడు ఓ ముచ్చట.. నాట్లనాడు ఓ ముచ్చట అని ఎద్దేవా చేశారు. ప్రతి రైతుకు డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణమాఫీ అన్నారని.. ఇంకా అమలు చేయలేదని చెప్పారు. నేడు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయట పెట్టారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ గాలిమాటలతో గారడీ చేసిందని, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు డబ్బాలో పడగానే తన నిజస్వరూపాన్ని బయటపెట్టిందని విమర్శించారు.

కూటమిదే అధికారం

కూడా కూటమికి కలిసొచ్చే అంశమన్నారు. రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పార్టీ గతం కంటే ఎక్కువ సీట్లను సాధిస్తోందన్నారు. మహారాష్ట్రలో ఎంఏవీ అలయన్స్ మంచి సంఖ్యలో స్థానాలను సాధిస్తుందన్నారు. గతంలో యూపీఏ అధికారంలో ఉన్న రెండు విడతల్లో కాంగ్రెస్‌కు 140, 206 స్థానాలే వచ్చాయని ఖర్గే గుర్తు చేశారు. అప్పుడు కూడా ఉపాధి హామీ, ఆర్టీఐ, ఆర్టీఈ, ఎన్ఎఫ్ఎస్ఏ, ఇండో-యూఎస్ న్యూక్లియర్ డీల్ వంటి మంచి పనులు చేశామన్నారు. భాజపాను ఓడించాలనే లక్ష్య సాధనలో భాగంగానే వేర్వేరు రాష్ట్రాల్లో విభిన్నమైన వ్యూహాలను అనుసరించినట్లు కాంగ్రెస్ చీఫ్ తెలిపారు. కేరళలో ఎవరు గెలిచినా భాజపాను వ్యతిరేకిస్తారన్నారు. అలానే దిల్లీ, హరియాణ, గుజరాత్‌లలో ఆప్ అలానే పనిచేస్తుందని వివరించారు. కేవలం పంజాబ్‌లో కాంగ్రెస్, ఆప్ మాత్రమే ప్రధాన పార్టీలు కావడంతో వేర్వేరుగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు.

భారత భద్రత ప్రయోజనాలను కట్టుబడి ఉన్నాం: శ్రీలంక

తెలపబోమని స్పష్టం చేశారు. భారత్ ఇతర దేశాలతో సంబంధాలు కొనసాగిస్తున్నట్లుగానే.. తమ విధానం కూడా ఉంటుందని వివరించారు. కానీ, ఇతరులకు హాని తలపెట్టే నిర్ణయాలను మాత్రం తీసుకోబోమని పేర్కొన్నారు. భారత్‌లో ఎన్నికలను ప్రజాస్వామ్య వేడుకగా అభివర్ణించిన సబ్రీ.. ఫలితాలపై స్పందించబోమని తెలిపారు. భారత ప్రజలు తెలివైనవారని.. ఎవరిని ఎన్నుకోవాలో వారికి తెలుసని వ్యాఖ్యానించారు. అంతర్గత అంశమైన ఎన్నికలపై అంతకు మించి తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయదల్చుకోలేదన్నారు. ఎన్నికల ఫలితంతో సంబంధం లేకుండా భారత్‌తో తమ బంధం కొనసాగుతుందని తెలిపారు. చైనాకు చెందిన ఓ గూఢచార నౌక గత ఏడాది శ్రీలంక హంబన్‌టోట నౌకాశ్రయంలో కొన్ని రోజుల పాటు ఆగింది. దానికి పొరుగు దేశాల నావికాదళ కార్యకలాపాలపై నిఘా వేసే సామర్థ్యం ఉన్నట్లు భారత్ గుర్తించింది. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు హాని కలిగించే ఏ విషయంలోనైనా తాము జోక్యం చేసుకుంటామని ఇరు దేశాలకు తేల్చి చెప్పింది.

ఏసీపీ నివాసంలో నోట్ల గుట్టలు

స్థిర, చరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీగా పనిచేసిన సమయంలో అక్రమార్జనతో భారీగా ఆస్తులు కూడబెట్టారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు ప్రస్తుతం పనిచేస్తున్న సీసీఎస్‌లో పలు కేసుల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితులకు న్యాయం చేయకుండా నిందితులకు మద్దతు పలుకుతున్నారని పలువురు సోదాలు జరుగుతున్న అతని నివాసం వద్దకు వచ్చి అధికారులకు మొరపెట్టుకున్నారు. సోదాలు ముగిసిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర తెలిపారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ప్రకటించాలి- ఎమ్మెల్యే హరీశ్

హైదరాబాద్ (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్రంలో వరికి చెల్లించే బోనస్ అంశం తీవ్ర దుమారం రేపుతోంది. సన్నం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో విపక్షాలు దీనిపై విమర్శలకు పదను పెట్టాయి. ఇదే అంశంపై విపక్ష బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. మేనిఫెస్టోలో వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని ఎమ్మెల్యే హరీశ్ రావు గుర్తుచేశారు. ఇప్పుడు మాట మార్చి సన్న వడ్డకు మాత్రమే ఇస్తాననడం సరికాదని గుర్తుచేశారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండుతుంది. అన్నింటికి బోనస్ ఇవ్వాలంటే రూ.6 వేల కోట్ల భారం పడుతుంది. అందుకోసం సన్నం వడ్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని హరీశ్ రావు విమర్శించారు. ఇలా చేస్తే రూ.400 కోట్ల మాత్రమే ఖర్చవుతుందని వివరించారు. యాసంగిలో రైతులు సన్నం వడ్లు పండించరని హరీశ్ రావు గుర్తుచేశారు. పండించని వడ్లకు బోనస్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బోనస్ ఇవ్వకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త కుట్రకు తెరతీసిందని విమర్శించారు. రైతు భరోసా కింద ఎకరాకు ప్రభుత్వం రూ.2500 ఇవ్వాల్సి ఉందన్నారు. వానాకాలానికి సంబంధించి ఎకరానికి 15 వేల రైతు భరోసాతోపాటు యాసంగి బకాయిలు కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు. దొడ్డు వడ్లు కొంటారా? కొనరా? కొంటె ఎప్పటి నుంచి కొంటారో చెప్పాలని సూటిగా అడిగారు. దొడ్డు వడ్లకు బోనస్ ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టమని తేల్చి చెప్పారు. ఇతర పంటల కొనుగోలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్లు కొనడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం వడ్లు కొనకపోవడం వల్ల రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇండియా కూటమికి ఎదురుదెబ్బ తప్పదు

- విపక్షాలపై మండిపడ్డ మోదీ

పట్నా(ప్రజా మంటలు):

అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, సనాతన వ్యతిరేక ఆలోచనా విధానం కలిగిన విపక్షాల కూటమికి.. ఈ ఎన్నికల ఫలితాల్లో భారీ ఎదురుదెబ్బ తప్పదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లపై పరోక్షంగా విరుచుకుపడిన ఆయన.. సంపన్న కుటుంబాల్లో జన్మించిన వారికి సామాన్యుల కష్టాలు తెలియవన్నారు. తనకు వారసులు ఎవరూ లేరని, దేశ ప్రజలంతా తన వారసులేనన్నారు. బిహార్‌లోని తూర్పు చంపారన్, మహారాజ్ గంజ్‌లలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న మోదీ.. విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, తుక్డే-తుక్డే గ్యాంగులకు ప్రాతినిధ్యం వహిస్తోన్న విపక్షాల కూటమి పాపాలతో దేశం ముందుకుసాగదు. సనాతన ధర్మాన్ని దూషించే వికృత మనస్తత్వం వారిది. రానున్న రెండు దశలు, ఆ తర్వాత తుది ఫలితాల్లో వారికి భంగపాటు తప్పదు. అణగారిన వర్గాల రిజర్వేషన్లను లాక్కొని.. ఓ వర్గం వారికి కేటాయించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. అంబేద్కర్ లేకుంటే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను నెహ్రూ కల్పించేవారు కాదు" అని మోదీ పేర్కొన్నారు."ఎన్నికల తర్వాత నేను విశ్రాంతి తీసుకుంటానని కొందరు (తేజస్వీ)చెబుతున్నారు. నా కన్నీళ్లు చూడాలని రాజకుమారుడు (రాహుల్ గాంధీ) కోరుకుంటున్నాడు. నేను జీవితం చరమాంకానికి చేరుకున్నానని, అందుకే వారణాసి నుంచి పోటీ చేస్తున్నానని ఓ నాయకుడు (అఖిలేశ్) చెబుతున్నాడు. ఇలా సంపన్న కుటుంబాల్లో జన్మించిన వీళ్లకు.. సామాన్యుల కష్టాలు తెలియవు" అని విపక్ష నాయకులపై మండిపడ్డారు. ప్రత్యర్థులు స్విస్ బ్యాంకుల్లో నోట్ల కట్టలను దాచి పెట్టుకున్నారని, పేద కుటుంబంలో పుట్టిన తన మాదిరిగా పేదల కష్టాలను అర్థం చేసుకోలేరన్నారు. ఆర్జేడీ-కాంగ్రెస్‌లు కలిసి బిహార్‌ను దోపిడీ రాజ్యంగా మార్చేశాయని ఆరోపించారు.

ఆర్థిక ప్రణాళికలో తప్పక గుర్తుంచుకోవాల్సినవి

జీవితంలో వివిధ దశలను విజయవంతంగా పూర్తి చేయడానికి, ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి సమర్థమైన ఆర్థిక ప్రణాళిక చాలా అవసరం. ఇది మీ అవసరాలను, ఆదాయాన్ని తెలివిగా ఉపయోగించుకోవడంలో మీకు ఎనలేని సహాయం చేస్తుంది.

సరైన సమయంలో మంచి ఆర్థిక నిర్ణయాలు తీసుకున్నవారు జీవితంలో ఎక్కువ భాగం సంతోషంగా గడిపేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా భవిష్యత్‌లో సంతోషకరమైన పదవీ విరమణ జీవితం గడిపేలా సహకరిస్తుంది. అయితే ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు, వ్యూహాలు అమలుచేయాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం..

ఆర్థిక లక్ష్యాలు రాసుకోండి

స్పష్టమైన ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం మంచి ఆర్థిక ప్రణాళికకు మూల స్తంభం. పిల్లల ఉన్నత (విదేశీ) విద్య కోసం, పిల్లల వివాహం, మెరుగైన పదవీ విరమణ, అత్యవసర నిధి కోసం తగిన లక్ష్యాలను కలిగి ఉండడం ఎంతో ప్రేరణను కలిగిస్తుంది. ఇలాంటి లక్ష్యాలు రాసుకోవడం వల్ల వాటిని ఆచరణలో పెట్టడానికి మార్గం సుగమం అవుతుంది. అయితే లక్ష్యాలు స్మార్ట్‌గా ఉండడమే కాకుండా సాధించగలవి, సమయానుకూలమైనవిగా ఉండాలి.

బడ్జెట్‌జి

బడ్జెట్ అనేది మీ ఆదాయం, ఖర్చులను నిర్వహించడంలో సహాయపడుతుంది. ఇది మీ డబ్బు ఎక్కడికి వెళుతుందో ట్రాక్ చేయడానికి, అధిక వ్యయం అయ్యే పరిస్థితులను గుర్తించడానికి, తదనుగుణంగా సర్దుబాట్లు చేయడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. బడ్జెట్‌లో అన్ని ఆదాయ వనరులు, స్థిర ఖర్చులు (అద్దె, యుటిలిటీలు, పాఠశాల ఫీజులు వంటివి), అస్థిర/వేరియబుల్ ఖర్చులు (కిరాణా, వినోదం, ప్రయాణాలు, దుస్తులు వంటివి), మొదలైన ఇతర ఖర్చులను కనుగొని అవసరాన్ని బట్టి మీ ఆదాయాన్ని కేటాయించండి. అత్యవసర పరిస్థితులు, పొదుపు, పెట్టుబడి ప్రయోజనాల కోసం నిధులను కేటాయించాలని నిర్ధరించుకోండి. విజయవంతమైన బడ్జెట్ అంటే రాసుకోవడమే కాదు.. దానికి కట్టుబడి ఉండాలి. మీ బడ్జెట్‌ను క్రమం తప్పకుండా సమీక్షించడం, సర్దుబాటు చేయడం కూడా ఆర్థిక లక్ష్యాలలో కీలకం.

స్కీమ్

ఇప్పుడే కొనుగోలు చేయండి..తర్వాత చెల్లించండి.. దీన్నే బై నౌ పే లేటర్ అని పిలుస్తారు. కొనుగోలు చేసిన వస్తువు/సేవకు వెంటనే చెల్లించాల్సిన అవసరం లేకుండా కొనుగోలు చేసే చెల్లింపు ఎంపిక. తిరిగి చెల్లించడానికి 90 రోజుల వరకు వడ్డీ లేని కాలవ్యవధి ఉంటుంది. ఇలాంటి పథకాలు ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. ఇటువంటి వాటికి దూరంగా ఉండడం మంచిది. ఇలాంటి రుణాలు ఎవరికైనా శక్తికి మించి ఖర్చు చేయడాన్ని ప్రోత్సహిస్తాయి. రుణ ఉచ్చులో ఇరుక్కోవడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. కాబట్టి, పెద్ద కొనుగోళ్లు చేసినప్పుడు ముందు పొదుపు చేసి తర్వాత ఖర్చు చేయడం మేలు.

పెట్టుబడులకు వద్దు ఆలస్యం

మీరు ఎంత త్వరగా పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తే.. మీ డబ్బు పెరగడానికి అంత ఎక్కువ సమయం ఉంటుంది. గరిష్ఠ ఆర్థిక ప్రయోజనాలను పొందొచ్చు. ఉదాహరణకు పదవీ విరమణకు మెరుగైన నిధిని ఆశించేవారు ముందుగా పెట్టుబడులు ప్రారంభించడం వల్ల సరిపడా పదవీ విరమణ నిధి పొందుతారు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్లు (ఈక్విటీ, డెట్) బాండ్లు, సావరిన్ గోల్డ్ బాండ్, అంతర్జాతీయ ఫండ్లు వంటి వివిధ ఆస్తులపై పెట్టుబడులు పెట్టేటప్పుడు మార్కెట్ పోకడలు, నష్టాల గురించి నిరంతరం అవగాహన చేసుకోవడం చాలా ముఖ్యం. పెట్టుబడి పోర్ట్‌ఫోలియో మీ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా క్రమం తప్పకుండా సమీక్షించడం చాలా అవసరం.

బీమా

బీమా అనేది ఊహించని పరిస్థితుల నుంచి రక్షణ కల్పించి, ఎవరికైనా పూర్తి ఆర్థిక రక్షణ అందిస్తుంది. ఊహించని పరిస్థితుల్లో మీ కుటుంబాన్ని ఆర్థిక ప్రతికూలతల నుంచి రక్షించడానికి జీవిత బీమా (టర్మ్ బీమా), ఆరోగ్య బీమాను తీసుకోండి. తనపై ఆధారపడ్డ కుటుంబం ఉన్నప్పుడు పాలసీదారుడు వార్షిక ఆదాయానికి 10-15 రెట్లు టర్మ్ బీమా పాలసీ తీసుకోవాలి. పెరుగుతున్న వైద్య ఖర్చులు చాలా కుటుంబాలను ఆర్థికంగా విచ్ఛిన్నం చేస్తున్నాయి. కుటుంబ సభ్యులందరూ కవర్ అయ్యేలా రైడర్స్‌తో కూడిన సమగ్ర ఆరోగ్య బీమా తీసుకోవడం వల్ల అనేక రకాల అనారోగ్యాలు కవర్ అవుతాయి.

రుణాలు

ఏదో ఒక సమయంలో రుణం తీసుకోవడం సాధారణమైన

విషయం అయినప్పటికీ.. ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి రుణం ప్రధాన అడ్డంకిగా ఉంటుంది. రుణాలు తీర్చేటప్పుడు ముందుగా క్రెడిట్ కార్డు బకాయిలు, వ్యక్తిగత రుణాలు వంటి అధిక-వడ్డీ రుణాలను క్లియర్ చేయడంపై దృష్టి పెట్టండి. అనవసరమైన ఖర్చులు, ఆడంబరాల కోసం కొత్త అప్పులు తీసుకోవడం సరైంది కాదు. రుణాలకు తగినంత నిధులను కేటాయించే బడ్జెట్‌ను రూపొందించుకుని దానికి కట్టుబడి ఉండండి.

పదవీ విరమణ నిధి

ప్రతి ఒక్కరూ పదవీ విరమణ తర్వాత గడిపే జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. పదవీ విరమణకు త్వరగా పెట్టుబడిని ప్రారంభించిన వారు మెచ్యూరిటీ సమయానికి ఆర్థికంగా పటిష్ఠంగా ఉంటారు. పదవీ విరమణకు ఎంత నిధి కావాలో ఇక్కడ ఒక లెక్క ఉంది. ఉదాహరణకు మీ వార్షిక ఖర్చులు రూ.8 లక్షలయితే.. దానికి 30 రెట్లు, అంటే రూ.2.40 కోట్ల పదవీ విరమణ నిధిని సమకూర్చడం లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇంకా భారత ప్రభుత్వం పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎన్‌పీఎస్ లాంటి పథకాలను అందిస్తోంది.

చివరిగా:

మీరు ఆర్థిక ప్రణాళికను అమలు చేసేటప్పుడు నిర్దిష్ట ఆర్థిక వ్యూహాలపై సలహాలు అవసరమైతే తప్పక ఆర్థిక సలహాదారుడి సహాయం తీసుకోండి. దీనివల్ల ఆర్థిక ప్రణాళికలో ముందుకు ఎలా వెళ్లాలో మేలైన సలహాలు, సూచనలు పొందొచ్చు.

ఎక్సైజ్ శాఖ ప్రక్షాళన

- ఎన్నికల కోడ్ ముగిసాక ప్రక్రియ మొదలు
- కొత్త బ్రాండ్లు తీసుకొచ్చే ఆలోచన లేదు
- బీఆర్ఎస్ పనీపాటలేని ఆరోపణలు చేస్తోంది
- మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శలు

హైదరాబాద్ (ప్రజా మంటలు):

తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లు తీసుకొస్తున్నామనేది దుష్ప్రచారమే నని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొత్త బ్రాండ్ల కోసం ఎవరూ దరఖాస్తు చేయలేదని, అసలు పరిశీలనే జరగలేదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరవాత ఎక్సైజ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దొంగే దొంగ అన్నట్లుగా భారాస నేతల మాటలు ఉన్నాయి. వారు ప్రతిదీ ఆరోపణలు చేసి బద్‌నామ్ చేసే దిశగా రాఝుకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చాలా శాఖల్లో బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. రైతు భరోసాకు సంబంధించి రూ.6వేల కోట్లకు పైగా చెల్లింపులు మా ప్రభుత్వంలో జరిగాయి. ఈ నెలలోనే రూ.370 కోట్ల చెల్లింపులు చేశాం. మద్యం కొరత ఉంటే ప్రభుత్వానికే నష్టం.. ప్రజలకు కాదు. బ్లాకులో అమ్మిన ఘటనలపై ఎక్సైజ్ శాఖ కేసులు నమోదు చేసింది. టానిక్‌లకు గత ప్రభుత్వం ఇచ్చిన పన్ను మినహాయింపులను రద్దు చేశాం. తయారీ యూనిట్ల వద్ద ఎలాంటి అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులు నిరంతరం పరిశీలిస్తున్నారు. గతంలో పైరవీలు, ముడుపులు ఉంటే తప్ప ఉద్యోగుల బదిలీలు జరిగేవి కావు. ఇప్పుడు అలాంటివేవీ లేకుండానే పోర్టల్ ద్వారా బదిలీలు జరుగుతున్నాయి. తప్పుడు రాతలు రాసిన పత్రికపై పరువునష్టం దావా వేస్తాం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎక్సైజ్‌శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం అని జూపల్లి తెలిపారు.

యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జ్ వీసీలు

- పది యూనివర్సిటీల బాధ్యతలను ఐఏఎస్‌లకు అప్పగింత
- ఉస్మానియాకు దాన కిశోర్..జెఎన్టీయూకు బుర్రా వెంకటేశం
- తెలుగు వర్సిటీ విసిగా శైలజారామయ్యర్‌ల నియామకం

హైదరాబాద్ (ప్రజా మంటలు):

తెలంగాణలోని యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్ల పదవీకాలం ముగియడంతో ఇన్‌ఛార్జ్ విసిలను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు ఇంఛార్జ్ వీసీలను నియమించారు. సీనియర్ ఐఏఎస్ అధికారులకు ఇంఛార్జ్ వీసీలుగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా దాన కిషోర్ నియమితులయ్యారు. జేఎన్టీయూ ఇంఛార్జ్ వీసీగా బుర్రా వెంకటేశం, కాకతీయ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా కరుణ వాకాటి,తెలంగాణ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా సందీప్ సుల్తానియా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా రిజ్వి, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా శైలజ రామయ్యర్, మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా నవీన్ మిట్టల్, శాతవాహన యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా సురేంద్రమోహన్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీ జయేష్ రంజన్, పాలమూరు యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా నదీం అహ్మద్‌లను ప్రబుత్వం నియమించింది.

చైనాలో ఐఫోన్లపై యాపిల్ భారీ డిస్కౌంట్స్..

సాధారణంగా యాపిల్ ఐఫోన్ కొనాలంటే కాస్త ఆలోచించాల్సిందే. ఎందుకంటే ఆ స్థాయిలో ఉంటాయి వాటి ధరలు. ఎప్పుడో కొత్త మోడల్ వస్తే గానీ పాత మోడళ్ల ధరలు తగ్గవు.

అందుకే ఐఫోన్ వాడాలనుకునేవారు ఏ ఆఫర్‌లోనో తక్కువ ధరకు వచ్చినప్పుడు వీటిని కొనుగోలు చేస్తుంటారు. అలాంటిది చైనాలో యాపిల్ ఐఫోన్ల ధరలను అమాంతం తగ్గిస్తోంది. లేటెస్ట్ మోడళ్లపైనా భారీ డిస్కౌంట్ అందిస్తోంది. అమెరికా, భారత్ తరహాలోనే యాపిల్‌కు చైనా అతిపెద్ద మార్కెట్. ప్రపంచ మార్కెట్‌లో శాంసంగ్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్న ఆ సంస్థకు చైనాలో మాత్రం హువావే సవాల్ విసురుతోంది. తన అమ్మకాలు పెంచుకుంటూ యాపిల్ మార్కెట్ వాటాకు గండి పెడుతోంది. ఇది యాపిల్‌ను కలవరపెడుతోంది. అందుకే విక్రయాలు పెంచుకునేందుకు తంటాలు పడుతోంది. ఇందులో భాగంగా మే 28 వరకు యాపిల్ తన అధికారిక స్టోర్‌లో భారీ తగ్గింపు ధరకే ఐఫోన్లను విక్రయిస్తోంది. ఐఫోన్ లేటెస్ట్ మోడల్ అయిన ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్ 1టీబీ వెర్షన్‌పై 2300 యువాన్లు (318 డాలర్లు) మేర డిస్కౌంట్ అందిస్తోంది. అంటే భారత కరెన్సీ ప్రకారం రూ.27 వేలు అన్నమాట. ఐఫోన్ 15 బేస్ వేరియంట్‌పైనా 1400 యువాన్ల (రూ.16వేలు)

మేర డిస్కౌంట్ అందిస్తోంది. ఈ ఏడాదిలో ఇలా ధరలు తగ్గించడం ఇది రెండోసారి. ప్రీమియం సెగ్మెంట్‌లో యాపిల్‌కు హువావే గట్టి పోటీనిస్తోంది. ఇటీవల ఆ కంపెనీ ప్యూరా 70 సిరీస్, మేట్ 60 ఫోన్లను లాంచ్ చేసింది. హువావే విక్రయాల వృద్ధికి ఇవి దోహదపడుతున్నాయి. దీంతో ఇటీవల వెలువడిన తొలి త్రైమాసిక ఫలితాల్లో గతేడాదితో పోలిస్తే అమ్మకాల్లో 70 శాతం వృద్ధిని నమోదు చేసింది. అదే సమయంలో యాపిల్ అమ్మకాలు 19 శాతం మేర క్షీణించినట్లు కౌంటర్ పాయింట్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. దీంతో 2023 తొలి త్రైమాసికంలో 20 శాతంగా ఉన్న యాపిల్ మార్కెట్ వాటా.. ఈ ఏడాది 15.7 శాతానికి పడిపోయింది. హువావే మార్కెట్ వాటా 9.3 శాతం నుంచి 15.5 శాతానికి పెరిగింది. హువావేతో పాటు ఇతర చైనా స్మార్ట్‌ఫోన్ కంపెనీల నుంచి కూడా యాపిల్‌కు గట్టి పోటీ ఎదురవుతోంది. ప్రపంచవ్యాప్తంగా విక్రయాల సంఖ్యపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే యాపిల్ భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తూ వినియోగదారులను ఆకర్షిస్తోంది.

అమెజాన్-ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు వాడుతున్నారా?

అమెజాన్‌పే- ఐసీఐసీఐ బ్యాంక్ కో బ్రాండ్ క్రెడిట్ కార్డ్ వాడుతున్నారా? అయితే మీకో బ్యాడ్ న్యూస్.

క్రెడిట్ కార్డు ప్రయోజనాల్లో బ్యాంక్ కొంత కోత పెట్టింది. సాధారణంగా క్రెడిట్ కార్డ్ ద్వారా చేసే వివిధ రకాల లావాదేవీలపై రివార్డు పాయింట్లు, క్యాష్‌బ్యాక్, డిస్కౌంట్లను ఐసీఐసీఐ అందిస్తోంది. ఇన్నాళ్లు అద్దె చెల్లింపులపై కూడా 1 శాతం రివార్డు పాయింట్లు ఇస్తోంది. ఇకపై ఈ రివార్డు పాయింట్లు ఉండవని బ్యాంక్ తెలిపింది. జూన్ 18 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపింది. ఇప్పటికే యూజర్లకు సందేశాలు పంపుతోంది.

ఇక ఈ క్రెడిట్ కార్డు విషయానికొస్తే.. జాయినింగ్ ఫీజు, ఎలాంటి వార్షిక రుసుమూ లేకుండానే ఐసీఐసీఐ బ్యాంక్-అమెజాన్ కో బ్రాండ్ క్రెడిట్ కార్డును జారీ చేస్తోంది. ఈ కార్డుతో అమెజాన్ కొనుగోళ్లపై ప్రైమ్ వినియోగదారులకు 5 శాతం క్యాష్‌బ్యాక్‌తో పాటు అదనపు డిస్కౌంట్లు ఇస్తోంది. ఇంధన సర్‌ఛార్జ్ చెల్లింపులపై 1 శాతం రాయితీ అందిస్తోంది. ఈఎంఐ లావాదేవీలుబంగారం కొనుగోళ్లపై మాత్రం రివార్డు పాయింట్లు ఉండవు.

విమానం ఢీకొని.. ఫ్లెమింగోలు మృతి

ముంబయి: ఓ విమానం ఢీకొనడంతో 30కి పైగా ఫ్లెమింగో పక్షులు మృతి చెందాయి. ఫ్లైట్ ల్యాండ్ అయ్యే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.ఈ ఘటన ముంబయిలో చోటుచేసుకొంది. పక్షులు ప్రాణాలు కోల్పోవడంపై విచారణ జరపాలంటూ పర్యావరణ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..దుబాయ్ నుంచి ముంబయికి వస్తున్న ఎమిరేట్స్ విమానం సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ల్యాండ్ కావాల్సిఉంది. ఈ క్రమంలోనే ఆ వైపుగా ఎగురుతున్న ఫ్లెమింగో పక్షుల గుంపు విమానాన్ని ఢీకొంది. కాసేపటికి ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ అయింది. అయితే, తీవ్రంగా గాయపడి వివిధ ప్రాంతాల్లో పడిపోయిన పక్షులను గుర్తించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ రాత్రి ఆయా ప్రాంతాల్లో 29కి పైగా.. మరుసటిరోజు మరికొన్ని పక్షుల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ జాతి పక్షులు ఈ ప్రాంతంలో కనిపించడం అరుదని అధికారులు పేర్కొన్నారు. ప్రమాదంపై దర్యాప్తు మొదలుపెట్టిన అధికారులు.. మరణించిన పక్షులకు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఫలితాలు వచ్చేం దుకు నాలుగురోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలంటూ పర్యావరణ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు..

ముంబయి: అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల నేపథ్యంలో దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి.ఉదయం 9:21 గంటల సమయంలో సెన్సెక్స్ 100 పాయింట్లు నష్టపోయి 73,906 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 46 పాయింట్లు కుంగి 22,455 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.31 వద్ద ప్రారంభమైంది.సెన్సెక్స్-30 సూచీలో టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, విప్రో, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. నెస్లే ఇండియా, ఎం అండ్ ఎం, హెచ్‌యూఎల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి షేర్లు అత్యధికంగా నష్టపోతున్న జాబితాలో ఉన్నాయి.అమెరికా మార్కెట్లు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. ఆసియా-పసిఫిక్ సూచీలు నేడు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు శనివారం జరిగిన ప్రత్యేక సెషన్‌లో నికరంగా రూ.93 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు) సైతం రూ.153 కోట్ల వాటాలను అమ్మేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 83.21 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఏఐ తరం కోసం మైక్రోసాఫ్ట్ కోపైలట్ + పీసీలు

కృత్రిమ మేధ ఫీచర్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ కొత్త తరం పర్సనల్ కంప్యూటర్లను ఆవిష్కరించింది.కోపైలట్ం పీసీల పేరిట వీటిని తీసుకొచ్చింది. ఇప్పటివరకు వచ్చిన పీసీల్లో ఇవే అత్యంత శక్తిమంతమైన, వేగవంతమైనవని కంపెనీ పేర్కొంది. కోపైలట్ం పీసీలను స్నాప్‌డ్రాగన్ ఎక్స్ సిరీస్ ప్రాసెసర్లతో రూపొందించారు. సెకనుకు 40 ట్రిలియన్ల ఆపరేషన్లు పూర్తి చేస్తాయి. వీడియో ఎడిటింగ్, క్లిష్టమైన డేటా అనాలసిస్, బహుళ ప్రోగ్రామ్‌లను రన్ చేయడం వంటి పనుల్లో వేగంగా స్పందిస్తాయి. దీర్ఘకాల లక్ష్యమైన ఏఐ పీసీల అభివృద్ధిలో భాగంగా మైక్రోసాఫ్ట్ వీటిని తీసుకొచ్చింది. ఈ ఫీచర్ల పూర్తి సామర్థ్యాన్ని వాడుకోవాలంటే సపోర్ట్ చేసే హార్డ్‌వేర్ ఉండాలి. ఏసర్, ఆసుస్, డెల్, హెచ్‌పీ, లెనొవొ, శామ్‌సంగ్ వంటి కంపెనీలు మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపాయి. ఈ కంపెనీలన్నీ జూన్ 18 నుంచి కోపైలట్ం పీసీలను తీసుకురానున్నాయి. మైక్రోసాఫ్ట్ సైతం ఈ కేటగిరీలో సర్ఫేస్ పేరిట డివైజ్‌లను విడుదల చేయనుంది.కోపైలట్ం పీసీల్లో రీకాల్ అనే ఏఐ ఫీచర్ ఉంటుంది. దీంతో పీసీలో ఏ సమాచారాన్నైనా వెంటనే పొందొచ్చు. ఫైల్, ఫోల్డర్, ఈమెయిల్‌ను గుర్తించడం సహా గతంలో మీరు పూర్తి చేసిన యాక్షన్‌లు, హిస్టరీని కళ్ల ముందుంచుతుంది. ఈ పీసీలు సమాచారాన్ని రిషేషన్‌షిప్,

అసోసియేషన్స్ ఆధారంగా సేవ్ చేస్తాయి.వీటిలో ఉన్న మరో ఏఐ ఫీచర్ కోక్రియేట్. ఇది పెయింట్, ఫొటోస్ వంటి యాప్‌లలో పనిని మెరుగుపరుస్తుంది. పెయింట్‌లో ఒక బొమ్మను గీస్తే ఏఐ కూడా దానికదే మరో దాన్ని గీసి చూపిస్తుంది. మనం దాన్ని టెక్స్ట్ కమాండ్‌లతో మెరుగుపర్చి వాడుకోవచ్చు. పెయింట్‌లోనూ ఫొటోలను ఏఐ టూల్స్ ఎడిట్ చేసే వెసులుబాటు ఉంటుంది. అడోబ్, క్యాప్‌కట్, డావిన్సీ రిసాల్వ్ స్టూడియో, సెఫబుల్, లిక్విడ్‌టెక్స్ట్ వంటి వాటితోనూ మైక్రోసాఫ్ట్ చేతులు కలిపింది. తద్వారా ఏఐ ఫీచర్లన్నింటినీ ఆయా యాప్‌లలో అనుసంధానం చేసింది.

ఆ బాలుడికి పోలీస్‌స్టేషన్‌లో పిజ్జా, బిర్యానీ

పుణె: మహారాష్ట్ర లోని పుణెలో ఓ బాలుడు లగ్జరీ కారుతో బైక్‌ను ఢీకొట్టి ఇద్దరి మరణానికి కారణ మైన కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇందులో నిందితుడు స్థానికంగా ప్రముఖ వ్యక్తి కుమారుడు కావడంతో పోలీసులు అతడిని వీఐపీలా ట్రీట్ చేసినట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్‌లో అతడికి పిజ్జా, బిర్యానీ అందించినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.పుణెలో ఆదివారం తెల్లవారుజామున ఓ బైక్‌ను లగ్జరీ కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు టెకీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో కారు డ్రైవ్ చేసిన నిందితుడు ఓ మైనర్ బాలుడు అని గుర్తించిన పోలీసులు అతడిని, అతడితో పాటు ఉన్న స్నేహితులను యార్వాడ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్కడ పోలీసుల అనుమతితో తల్లిదండ్రులు అతనికి పిజ్జాలు, బర్గర్లు, బిర్యానీ ఆర్డర్ చేసినట్లు సమాచారం. దీనిపై కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తూ పోలీసుస్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు.ఈ కేసులో నిందితుడికి 15 గంటల్లోనే బెయిల్ రావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. అతడి బెయిల్‌ను రద్దు చేసి అరెస్టు చేయాలని మృతుల కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. బెయిల్ సమయంలో కోర్టు విధించిన షరతులు కూడా చర్చనీయాంశ మయ్యాయి. 300 పదాల్లో ప్రమాదంపై వ్యాసం రాయాలని, 15 రోజుల పాటు ట్రాఫిక్ పోలీసులతో పని చేయాలంటూ న్యాయస్థానం చెప్పడం గమనార్హం. మరోవైపు, లైసెన్సు రాకుండానే బాలుడికి కారు ఇచ్చిన నిందితుడి తండ్రిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఘటనసమయంలో బాలుడు మద్యం తాగినట్లు పోలీసులు గుర్తించారు.

పెంపకం

నారాయణపురం ఊరిలో నారాయణ, లక్ష్మీ దంపతులున్నారు. వీరికి రాహుల్ అను కొడుకు ఉన్నాడు. రాహుల్ 3వ తరగతి చదువుతున్నాడు. అల్లరి పిలగాడు. కారణంలేకుండానే తోటి పిల్లలను కొడుతాడు. వస్తువులు పగలగొట్టి సంబరపడుతాడు. తల్లిదండ్రి రాహుల్ను బడికి పంపుతున్నారు.

రాహుల్ ఒకరోజు బడిలో తోటి విద్యార్థుల బ్యాగుల్లో కలర్ పెన్సిల్లు దొంగతనం చేశాడు. ఇంటికి వచ్చిన తరువాత వాటితో గోడలపైన, తలుపులు పైన అడ్డదిడ్డంగా రాసాడు. రాతలను చూసిన తల్లి లక్ష్మీ ఏంరాస్తున్నావురా? అని గదిరించింది. దగ్గరకు వెళ్లి రంగు పెన్సిల్లు గుంజుకుంది. ఇవి ఎక్కడియిరా నాన్న నేను కొనివ్వలేంకదా అని గట్టిగా అడిగింది. ఆ. . నాయే. నేను దుకాణంలో కొనుకున్నా అని చెప్పాడు. తల్లి అబద్ధం చెపుతున్నాడని ఒకటి తగిలించింది. ఏడుస్తూ అమ్మ కొట్టద్దమ్మా అంటు ఏడ్చాడు. బడిలో తోటి వారి బ్యాగుల్లో దొంగతనం చేశానని చెబుతాడు. దొంగతనంచేస్తావా అంటూ మళ్లొకటి తగిలించింది. వాళ్ల రంగు పెన్సిల్లు వాళ్లకి ఇచ్చేయ్ లేకపోతే తోలు తీస్తా అని బెదిరిస్తుంది. దొంగతనం చేయొద్దని మళ్లీ ప్రేమగా బుదరకించి చెబుతుంది.

బడిలో ఒకరోజు తోటి విద్యార్థి రఘు చక్కగా రాసుకుని బుక్, పెన్ను బ్యాగు పైన పెట్టి నీళ్లు తాగడానికి పోయాడు. రాహుల్ రాసిన రాతను చిందరవందరగా గీసేస్తాడు. పెన్ను విరగ్గొట్టి పెడుతాడు. ఏమి చేయనట్లు నిశ్శబ్దంగా కూర్చుంటాడు . రఘు వచ్చి చూసి ఏడుస్తూ టీచరుకు చెబుతాడు. టీచరు ఎవరు గీసారో, విరగొట్టారో చెప్పండి. లేకపోతే దెబ్బలు తప్పవంటుంది. ఎవరు చెప్పరు. ఎప్పుడు అల్లరిగా ఉండే రాహుల్ నిశ్శబ్దంగా కూర్చున్నాడు. అనుకుని రాహుల్ని ప్రశ్నిస్తుంది. నాకు ఏమి తెలియదు టీచర్. నేను చక్కగా కదలకుండా ఇక్కడే కూర్చొని ఉన్నాను అంటాడు. కట్టెలేపి రాహుల్ నువు చేసేది చేసి ఏమి ఎరుగనట్టు నటిస్తున్నావు. నీవే కదా చేసింది అని బిగ్గరగా అడుగుతుంది. భయపడిపోయిన రాహుల్ నేనే గీసి విరగొట్టాను టీచర్ అంటాడు. అయినా టీచర్ రెండు దెబ్బలు కొడుతుంది. వద్దు టీచర్ ,వద్దు టీచర్ అని ఏడుస్తాడు. బడిలో బుద్ధిగా ఉండి చదువుకోవాలి ఇలాంటి చెడుగు పనులేందనీ అడుగుతుంది. బుద్ధిగా చదువుకో అని ఓదార్చి చెబుతుంది .

సాయంకాలం ఇంటికి వెళ్ళుతున్న సమయంలో రాహుల్ పవన్ మొఖంపై పెన్నుతో గుచ్చి ఉరుకుతాడు. పవన్ అమ్మా అని ఏడుస్తూ కూలబడి పోతాడు. పిల్లలందరూ టీచరుకు చెప్పగానే వచ్చి ఫస్ట్ ఏయిడ్ చేస్తారు. రాహుల్ దొరుకలేదు. పారిపోయాడు. పిల్లలందరూ రాహుల్ పెట్టిన ఇబ్బందులను ఒక్కసారిగా చెబుతారు. టీచర్ రాహుల్ తల్లిదండ్రిని పిలిపించి మాట్లాడుతాను. మీరు వెళ్ళండి అంటుంది.

రాహుల్ ఇంటికి వెళ్లుతూ పిల్లలు ఎవరు లేకపోవడం చూసి ఒక ఇంటి ముందర ఉన్న చిన్న సైకిల్ దొంగతనంచేసి తన ఇంట్లోకి తీసుకెళ్లి కనపడకుండా పరదా కప్పుతాడు. ఏమి ఎరుగనట్టు బుద్ధిమంతుడు లాగ ఉంటాడు. సైకిల్ పోయినవారు రాహుల్ తీసుకొచ్చాడనీ తెలిసి ఇంటిముందర లొల్లి లొల్లి జేస్తారు. ఏమి తెలియని నారాయణ, లక్ష్మీ మా రాహుల్ తీసుకురాలేదు మీరు వెళ్ళండి అంటారు. మీ కొడుకును పిలువండి మేము అడుగుతాం అంటారు. పిలువగానే వచ్చిన రాహుల్ నేను తీయలేదు అమ్మా అని ఉత్తముడులాగా చెప్తాడు. నీవే తెచ్చావనీ చూసిన చింటు మాకు చెప్పాడు అన్నారు. అవమానంతో ఊగిపోయిన నారాయణ రాహుల్ ను తెచ్చావా లేదా అని బెదిరించి రెండు దెబ్బలు కొడుతాడు. భయపడిపోయిన రాహుల్ తెచ్చాను నాన్న ఇంట్లో పరదాకింద దాచాను . అనగానే తల్లి తెచ్చి ఇస్తుంది. నీకు ఇలాంటి దొంగ పనులు, అల్లరి పనులు ఎందుకు? మేము కొనిస్తామ్ కదా! బుద్ధిగా చదువుకో అని కోప్పడుతుంది. అందరు ఇవేంపనులనీ తిడుతారు. సైకిల్ తీసుకుని వారు వెళ్ళిపోతారు. నారాయణ, లక్ష్మీ ఇద్దరు మాట్లాడుకుంటారు. రాహుల్ పెంపకంలో మనము జాగ్రత్తపడాలి. లేకపోతే మన కుటుంబానికే కాదు ఈ ప్రపంచానికే ప్రమాదం. "మొక్కై వంగనిది మ్రానై వంగునా" అంటారు కాబట్టి బాల్యం నుండి సరిగా పెంచాలి.

రాహుల్ ఇంట్లోకి వెళ్లి అందరు నన్నే తిడుతున్నారనీ ఏడుస్తూ అలిగి కూచుంటాడు. నారాయణ, లక్ష్మీ ఇలాంటి లక్షణాలు ఎందుకొచ్చాయి ఈ రాహుల్కు అనుకుంటూ ఎలాగైనా మార్చాలనీ నిర్ణయించుకుంటారు. ఇంతలోనే పాఠశాల ప్రధానోపాధ్యాయుడునుండి ఫోన్ వస్తుంది. తల్లి దండ్రులు ఇద్దరు రేపు పాఠశాలకు రావాలనీ చెబుతాడు. ఒక్కసారిగా రాహుల్ అక్కడ ఏమి చేసాడో అని భయపడుతారు. లక్ష్మీ రాహుల్ దగ్గరగా వెళ్లి మాట్లాడుతుంది. నాయనా ఏమి అల్లరి, దొంగపనులు. నీకు అన్ని తెస్తున్నాము బుద్ధిగా చదువుకోవచ్చు కదా అంటుంది . చిన్న పిల్లాడివి. ఇప్పుడే ఇలా ఉంటే పెద్దైన తర్వాత గజ దొంగగా, రౌడీగా తయారు అవుతావేమోననీ మాకు భయమవుతుంది అంటూ కోప్పడుతుంది. అందరు నన్నే తిడుతారు,కొడుతారు,కోప్పడుతారు. అని బిగ్గరగా ఏడుస్తాడు. నాయనా ఏడువకు. నిన్నే ఎందుకు తిడుతారో ఆలోచించు చక్కగా చదువుకో. ఇప్పుడు తిని పడుకో అని ఓదార్పుతో బుదరకిస్తూ అంటుంది.

తెల్లవారి నారాయణ , లక్ష్మీ పాఠశాలకు వెళ్లి నమస్కారాలు హెచ్. ఎమ్ గారు అంటారు. హెచ్. ఎమ్ గంగారాం ప్రతి నమస్కారాలు చేసి. నారాయణ లక్ష్మీ గార్లు కూర్చొండి అంటాడు. అలాగే రాహుల్ ను ఆ క్లాస్ టీచర్ ను పిలువండి అని అటెండర్కు చెబుతాడు. రాగానే టీచర్ అంతకు ముందు రోజు జరిగిన సంఘటన పిల్లలు చెప్పిన బాధలు అన్నీ వివరంగా చెబుతుంది. రాహుల్ పాఠశాలలో అల్లరి పనులు చేస్తున్నాడనీ, నిన్న పవన్ మొఖంపై పెన్నుతో గుచ్చాడు. ఇంకా కంట్లో గుచ్చిఉంటే కన్ను పోయేది. చికిత్స చేయించాము. వాళ్ల తల్లిదండ్రులతో మాట్లాడి సర్ధి చెప్పాము అంటుంది. రాహుల్కు టి. సి ఇచ్చి పంపించండి అతడిని మార్చలేము అంటుంది టీచర్. రాహుల్ ఒక్కసారిగా భయపడిపోతాడు. తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతారు.

ప్రధానోపాధ్యాయుడు కలుగజేసుకుని ఏమయ్యా రాహుల్ నీవు చేసే దుడుగు పనులు ఇలా ఉన్నాయి . నీతోనే పాఠశాలకు చెడు పేరు వస్తుంది. ఏమంటావు చెప్పు? అని అడుగుతాడు . సార్ నేను చక్కగా చదువుకుంటాను. ఎవరినీ ఏమీ అనను. నేను దొంగతనం చేయను అంటాడు రాహుల్. మాటలు కాదు చేతలల్లో చూపాలి. ఇప్పుడు నటిస్తావు. తర్వాత ఎప్పటోలే చేస్తావు. ఎట్లా నమ్మేది అంటాడు ప్రధానోపాధ్యాయుడు . రాహుల్ ఏడుస్తూ నేను చక్కగా చదువుకుంటాను. నాకు టి. సి ఇవ్వొద్దని ఏడుస్తూ బతిమాలుతాడు. అది చూసి అందరూ బాధపడుతారు. రాహుల్ ను క్లాస్ రూంకు వెళ్లమంటాడు ప్రధానోపాధ్యాయుడు.

పెద్ద సార్ తల్లిదండ్రులతో మీ పెంపకం కూడా సరిగా ఉండాలి. పిల్లలపట్ల జాగ్రత్తగా ఉండాలి. ఇప్పటికీ మించినది ఏమిలేదు. మేము గురువులుగా ఒక అవకాశం ఇస్తున్నాము. ఇప్పుడు దండించినంత మాత్రానా ఒకేసారి మార్పురాదు. మీరు మేము రాహుల్ ను ఉత్తముడుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉంది. పాఠశాలలో ఇంకా రాహుల్ పైన ప్రత్యేక శ్రద్ధ పెడుతాము. కౌన్సిలింగ్ ఇస్తూ బోధన చేస్తాము. అలాగే మీరు తల్లిదండ్రులుగా ప్రతిరోజూ చదువుతున్నాడా? అల్లరి, దొంగతనాలు ఏమైనా చేస్తున్నాడా? ఎలా నడుచుకుంటున్నాడో నిఘా పెట్టండి అంటాడు. నారాయణ లక్ష్మీ గార్లు మేము పిల్లవాడిపై శ్రద్ధ పెడుతున్నాం మా పెంపకం సరిగానే ఉంది. ఇలా ఎందుకు చేస్తున్నాడో అర్థం కావడంలేదు అంటారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మీరు పట్టించుకోవడం లేదనీ నేను అనడంలేదు. పాఠశాలనుండి పోయిన తర్వాత మీ ఇంటిదగ్గరనే ఎక్కువగా ఉంటాడు. తల్లిదండ్రులుగా ఇంటివద్ద మీరు , గురువులుగా పాఠశాలలో మేము సరిగా శ్రద్ధ తీసుకుని బుద్ధులు చెబితే ఎలాంటి విద్యార్థులు అయిన మంచి మార్గంలో పయనించి ఉత్తమ పౌరులుగా రాణిస్తారని అంటాడు. సరే మేము ఇంటికి వెళ్తాము అనగానే వెళ్లి రండి. అంటాడు ప్రధానోపాధ్యాయుడు.

పాఠశాలలో పిల్లలు రాహుల్ దగ్గర కూర్చోవడానికి ఇష్టపడరు. సరిగా మాట్లాడరు. దూరం దూరం ఉంటారు. రాహుల్ బాధపడుతాడు. ఇంటికి వెళ్ళిన తరువాత రూంలో కూర్చుని బాధపడుతూ ఏడుస్తూ ఆలోచిస్తాడు. నన్ను ఎందుకు దూరం కొడుతున్నారు? నాతో ఎందుకు మాట్లాడడంలేదు? నన్ను వింతగా చూస్తున్నారు ఎందుకు? నేను ఏమి తప్పులు చేశాను చేస్తున్నాను?. అమ్మా,నాన్న, గురువులు ఎందుకు కోప్పడుతున్నారు? అనుకుంటూ దీర్ఘాలోచనలోపడుతాడు. తల్లి లక్ష్మీ కొడుకు రాహుల్ ను చూసి దగ్గరకు వచ్చి నాయనా ఎందుకో బాధగా ఆలోచిస్తున్నావు. అందరు నీ మంచికే చెప్పారు. ఇప్పటికైనా అల్లరి, దొంగతనాలు, చెడు పనులు మానుకో . బుద్ధిగా చదువుకో. గురువులు అమ్మా నాన్న చెప్పిన మంచి మాటలు విను. ఎవరినీ ఏమనకూ,అందరితో స్నేహంగా ఉండు. టి. వి, సెల్ ఫోన్లకు అతుక్కపోవద్దు. సోమరితనం విడువు. సమయపాలన పాటించు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించు. పిన్నలను, తోటి వారిని అభిమానించు. ప్రణాళిక బద్ధంగా చదువు. నీవు పెద్ద ఆఫీసర్ కావచ్చు అంటుంది. శ్రద్ధగా వింటాడు . రాహుల్ నీవు పెద్దయ్యాక ఏమి కావాలనుకుంటున్నావు? అడుగుతుంది తల్లి . ఐ. పి. ఎస్ అంటాడు . వెరీ గుడ్. ఐ. పి. ఎస్ గురించి నీకేమి తెలుసు? . మొన్న మా క్లాసులో టీచర్ ఇండియన్ పోలీస్ సర్వీస్ అని చెప్పింది అంటాడు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటే తొలిగించవచ్చునీ, రక్షణ కల్పించవచ్చునీ , దొంగతనాలు నివారించవచ్చునీ, శాంతి భద్రతలు కాపాడవచ్చునీ చెప్పింది అంటాడు. నేను బాగా చదివి ఆ ఉద్యోగం సాధిస్తాను అంటాడు. నాయనా ఏకాగ్రత,పట్టుదల, శ్రమించడం చేయాలి ఏదైనా సాధించవచ్చు అంటుంది.

రాహుల్ ఎలాగైనా ఐ. పి. ఎస్ కావాలని కలలు కంటాడు. నిత్యం ఉదయం లేవడం సమయం ప్రకారం పనులన్నీ పూర్తి చేసుకుంటాడు. పాఠశాలకు వెళ్లడం, గురువులు చెప్పింది శ్రద్ధగా వింటాడు. తోటి విద్యార్థులతో చక్కగా మెదులుతాడు. ఎవరినీ ఏమీ అనడు. రోజు ఐ. పి. ఎస్ కావాలని అదే ఆలోచన. తగిన వ్యాయామం చేస్తాడు. రక్షణ బాధ్యతలు చేపట్టాలనీ ఉవ్విళ్లూరుతుంటాడు. సంవత్సరాలు గడుస్తాయి. చదువు పూర్తి చేసుకుంటాడు. ఐ. పి. ఎస్ పరీక్షలు రాసి టాపర్గా నిలుస్తాడు. ఉద్యోగం సాధిస్తాడు. చక్కగా విధులు నిర్వహించి అందరి మెప్పు పొందుతాడు. అవమానించినవారే ఔరా అని ఆశ్చర్యపోతారు. అందరికీ రాహుల్ ఆదర్శంగా నిలుస్తాడు.

-డా. వాసరవేణి పరశురాం
బాలసాహిత్య రచయిత, పరిశోధకులు,
సింగారం, రాజన్న సిరిసిల్ల.

కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను సబ్ స్క్రయిబ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను పోస్టు పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.

mantalukathalu@gmail.com

అంతఃకారణ లేని బోధనలు.. ఆత్మశుద్ధిలేని కర్మలు వృధా

బుద్ధ జయంతి సందర్భంగా

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

గౌతమ బుద్ధుడు లేదా సిద్ధార్థుడు ప్రపంచంలో గొప్ప ఆధ్యాత్మిక వేత్త, నేపాల్ కి చెందిన గౌతమ బుద్ధుడు ప్రారంభించిన బౌద్ధ మతం (బుద్ధిజం) ప్రపంచంలోని పలు ప్రాంతాలకు పాకింది.. అలాగే అనేకమందికి స్ఫూర్తినిచ్చింది. గౌతమ బుద్ధుడు ఆత్మ జ్ఞానాన్ని ప్రబోధించాడు. మహా బుద్ధుడిగా కీర్తింపబడే బుద్ధుని జనన మరణాల కాలం స్పష్టంగా తెలియ రావడం లేదు. 20వ శతాబ్దపు చారిత్ర కారులు క్రీ.పూ 563 నుండి 483 మధ్యలో జననం అని, 410 నుండి 400 మధ్యలో మరణం ఉండవచ్చు అని భావిస్తున్నారు. సిద్ధార్థుడు కపిలవస్తు దేశానికి చెందిన లుంబిని పట్టణంలో జన్మించాడు. భౌగోళికంగా ఈ ప్రాంతం ప్రస్తుత నేపాల్ దేశంలో ఉంది. కానీ చారిత్రకంగా ఈ ప్రాంతం ప్రాచీన భారతదేశం లోకి వస్తుంది. గౌతమ అనునది సిద్ధార్థుని ఇంటి పేరు కాదు. సిద్ధార్థుని పెంచిన తల్లి గౌతమి. అందుకు గాను ఆయనకు ఆ పేరు వచ్చింది. తండ్రి శుద్దోధనుడు, తల్లి మహామాయ (మాయాదేవి, కోళియన్ దేశపు రాకుమారి), సిద్ధార్థుడు గర్భమందున్నప్పుడు, మాయాదేవి, ఒక ఆరు దంతముల ఏనుగు తన గర్భములోకి కుడి వైపు నుండి ప్రవేశించినట్లుగా ఒక స్వప్నమందు దర్శించింది. అది జరిగిన పది చంద్ర మాసముల తర్వాత సిద్ధార్థుడు జన్మించాడు. శాక్య వంశాచారము ప్రకారం, గర్భావతిగానున్న మాయాదేవి, ప్రసవానికి తన తండ్రిగారింటికి బయలు దేరింది. కానీ మార్గ మధ్యంలో, లుంబిని అనే ప్రాంతంలో ఒక సాలవృక్షం క్రింద ఒక మగ బిడ్డను ప్రసవించింది.

అనేక ఆధారాలను బట్టి, ప్రసవ సమయంలోగాని లేదా మగబిడ్డ జన్మించిన కొద్ది రోజుల తర్వాత గానీ మాయాదేవి మరణించినదని తెలుస్తుంది. అలా పుట్టిన బిడ్డకు సిద్ధార్థుడు అని నామకరణం చేశారు. "సిద్ధార్థుడు" అంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించేవాడని అర్థం. సిద్ధార్థుడు జన్మించిన ఐదవ దినము నాడు, నామకరణం చేసి, ఆయన భవిష్యత్తుని చెప్పమని, ఎనిమిది మంది జ్యోతిష్కులని శుద్దోధనుడు ఆహ్వానించాడు. వారిలో కౌండిన్యుడనే పండితుడు... సిద్ధార్థుడు భవిష్యత్తులో, బుద్ధుడవుతాడని జోస్యం చెప్పాడు. సిద్ధార్థుడు బాల్యం నుంచి రాకుమారుడిగా విలాస వంతమైన జీవితం గడిపాడు. శుద్దోధనుడు, సిద్ధార్థుని గొప్ప చక్రవర్తిని చేయాలనే ధ్యేయంతో అతడికి ఎలాంటి తాత్విక విషయాలు గాని, సామాన్య ప్రజల కష్టసుఖాలు గాని తెలియకుండా పెంచాడు. సిద్ధార్థుడు తన పినతల్లి అయిన మహా ప్రజాపతి పెంపకంలో పెరిగాడు. సిద్ధార్థునకు 16 ఏండ్ల ప్రాయము వచ్చేసరికి" వివాహ మయ్యింది. వీరికి రాహులుడనే కుమారుడు. పుట్టాడు. ఈ విధంగా సిద్ధార్థుడు 29 ఏళ్ల వరకు రాజ భోగాలను అనుభవించాడు.

బహిక ప్రపంచపు కష్టసుఖాలు తెలియకూడదని, శు ద్దో ధనుడు ఎంత ప్రయత్నించినా, తన 29వ ఏట, ఒక రోజు, ఒక ముసలి వ్యక్తిని, ఒక రోగ పిడితుడ్ని, ఒక కుళ్ళిపోతున్న శవాన్ని, ఒక సన్యాసిని చూశాడు. అప్పుడు తన రథసారథి ఛన్న (చెన్నుడు) ద్వారా, ప్రతి మానవుడూ ముసలితనం నుంచి తప్పించు కోలేడని తెలుసుకుని, తీవ్రంగా కలత చెంది, ముసలితనాన్నీ, రోగాన్నీ, మరణాన్ని జయించాలనే సంకల్పంతో సన్యాస జీవితం గడప నిశ్చయించాడు. సిద్ధార్థుడు పరివ్రాజక జీవితం గడపడానికి, తన రథసారథి ఛన్న సహాయంతో, ఒకనాడు రాజభవనం నుంచి కంతక అనే గుర్రంపై తప్పించుకున్నాడు. ఈ విధంగా ఒక బోధిసత్వుని నిష్క్రమణ ఆయన భటులకు తెలియకుండా ఉండడానికి, గుర్రపు డెక్కల చప్పుడు దేవతలచే అపబడిందని చెప్తారు. దీనినే ఒక గొప్ప నిష్క్రమణ (మహాభినిష్క్రమణ) అంటారు. సిద్ధార్థుడు తన సన్యాసి జీవితాన్ని రాజగృహ (మగధ సామ్రాజ్యంలో ఒక పట్టణం) లో భిక్షాటన ద్వారా ప్రారంభించాడు. కానీ బింబిసార మహారాజ సేవకులు, సిద్ధార్థుని గుర్తించడంతో, బింబిసారుడు, సిద్ధార్థుని అన్వేషణకు కారణం తెలుసుకుని, ఆయనకు తన సింహాసనాన్ని (మహారాజు పదవిని) బహుకరించాడు. కాని ఆయన ఆ బహుమానాన్ని తిరస్కరిస్తూ, తన జ్ఞాన సముపార్జన పూర్తయ్యాక మొదట మగధ సామ్రాజ్యం కు వస్తానని మాటిచ్చాడు. తర్వాత సిద్ధార్థుడు, రాజగృహను విడిచిపెట్టి, ఇద్దరు సన్యాసుల వద్ద శిష్యరికం చేశాడు. ఆలరకలమ అనే సన్యాసి, తన బోధనలలో సిద్ధార్థుని ప్రావీణ్యాన్ని చేసి, తన వారసుడిగా ఉండమని కోరాడు. కాని ఆ బోధనలవల్ల సిద్ధార్థుని జ్ఞానతృష్ణ తీరక పోవడంతో నిరాకరించాడు. తర్వాత సిద్ధార్థుడు ఉదకరామపుత్త అనే యోగి శిష్యరికంలో యోగశాస్త్రాన్ని క్షుణ్ణంగా అభ్యసించాడు. కాని ఇది కూడా సిద్ధార్థుని జ్ఞానతృష్ణని తీర్చక పోవడంతో, వారసత్వం పుచ్చుకోమన్న ఆ యోగి కోరికను కూడా నిరాకరించాడు.

తర్వాత సిద్ధార్థుడు, కౌండిన్యుడనే యోగి వద్ద మరో ఐదుగురు వ్యక్తులతో కలిసి శిష్యరికం చేశాడు. ఆ శిష్యబృందమంతా, జ్ఞాన సముపార్జన కొరకు, బాహ్య శరీర అవసరాలను (ఆహారంతో సహా) పూర్తిగా త్యజించి సాధన చేసే వారు. ఈ విధంగా సిద్ధార్థుడు. రోజుకు ఒక పత్రాన్ని గాని, ఒక గింజను గాని ఆహారంగా తీసుకుంటూ తన శరీరాన్ని పూర్తిగా క్షీణింప చేసుకున్నాడు. చివరికి ఒకనాడు, సిద్ధార్థుడు, నదిలో స్నానమాచరిస్తుండగా పడిపోయాడు. అప్పుడు సిద్ధార్థుడు తను ఎంచుకున్న మార్గం సరియైనది కాదని తెలుసుకున్నాడు. సిద్ధార్థుడు ధ్యానం, అనావనసతి (ఉశ్వాస, నిశ్వాసలు) ద్వారా మధ్యమ మార్గాన్ని కనిపెట్టాడు. (బహిక సుఖాలను, కోరికలను తృజించడం). ఈ సమయంలో సుజాత అనే పల్లె పడుచు తెచ్చే కొద్ది అన్నాన్ని, పాలను ఆహారంగా తీసుకునేవాడు. తర్వాత సిద్ధార్థుడు, బుద్ధ గయలో ఒక బోధి వృక్షం నీడలో పరమ సత్యం తెలుసుకొనుటకు భగవత్ ధ్యానం చేశాడు. కాని కౌండిన్యుడు, అతని ఇతర శిష్యులు, సిద్ధార్థుడు జ్ఞాన సముపార్జన సాధనను విరమించినట్లుగా, క్రమశిక్షణా రహితుడుగా భావించారు. చివరకు, తన 35వ ఏట, 49 రోజుల ధ్యానం తర్వాత, సిద్ధార్థునకు జ్ఞానోదయమయ్యింది. అప్పటి నుండి గౌతమ సిద్ధార్థుడు, గౌతమ బుద్ధునిగా మారాడు. బౌద్ధ మతంలో ఇతనిని శాక్యముని బుద్ధుడని భావిస్తారు. జ్ఞానోదయమయ్యాక గౌతమ బుద్ధుడు, మానవుని అజ్ఞానానికి, కష్టాలకు కారణాలను, వాటి నుండి విముక్తి పొందడానికి మార్గాలను తెలుసుకో గలిగాడు. వీటిని పరమ సత్యాలుగా విభజించాడు. దీనినే బౌద్ధ మతంలో నిర్వాణమంటారు. గౌతమ బుద్ధుడు, ప్రతి బుద్ధునకు ఉండవలసిన 9 లక్షణాలను ప్రతిపాదించాడు. జ్ఞానోదయమయ్యాక, గౌతమ బుద్ధుడు, తపుస్సా, భల్లక అనే ఇద్దరు వర్తకులను తన ప్రథమ శిష్యులుగా చేసుకున్నాడు. వారికి బుద్ధుడు తన తల నుండి కొన్ని వెంట్రుకలను ఇచ్చాడనీ, వాటిని ఇప్పటికీ రంగూన్ లో ఉన్న ష్యూ డాగన్ ఆలయంలో భద్రపరిచారనీ ప్రజలు నమ్ముతున్నారు. తర్వాత బుద్ధుడు వారణాసిలో ఒక లేళ్ళ ఉద్యానవనంలో, కౌండీన్యుని దగ్గర, తనతో పాటూ శిష్యరికం చేసిన మిగతా ఐదుగురు సన్యాసులకు, తను తెలుసుకున్న పరమ సత్యంపై మొదటి ఉపన్యాసం ఇచ్చాడు. వీరంతా బుద్దునితో కలిసి మొదటి బౌద్ధ భిక్షువులు సంఘాన్ని ఏర్పరిచారు. ఈ విధంగా "బుద్ధం, ధర్మం, సంఘం' అనే మూడు సూత్రాలతో కూడిన మొదటి బౌద్ధ మత సంఘం ఏర్పడింది. తర్వాత యాసుడు, అతని 54 మంది మిత్రుల చేరికతో బౌద్ధ మత సంఘంలోని వ్యక్తుల సంఖ్య 60 ని దాటింది. తర్వాత ముగ్గురు కశ్యప సోదరులు, వారి 200, 300, 500 మంది శిష్యుల చేరికతో బౌద్ధ మత సంఘ పరిమాణం 1000 ని దాటింది. వీరంతా బుద్దుని బోధనలను, సామాన్య ప్రజలకు బోధించడానికి ప్రపంచమంతా పర్యటించారు. బౌద్ధ మతంలో అన్ని జాతులు తెగలకు చెందిన ప్రజలు మారడానికి వీలుండడం, కుల, వర్గ విభజనలేకపోవడంతో బౌద్ధ మత సంఘంలోకి వేల కొద్దీ ప్రజలు రావడం మొదలు పెట్టారు. దీని వల్ల గౌతమ బుద్ధుడు ఇతర మతస్తుల నుండి బెదిరింపులు, హత్యా యత్నాలు ఎదుర్కొన్నాడు. శుద్దా దోధనుడు బౌద్ధ సంఘంలో చేరి శాతపన్నునిగా మారాడు. ఈ సమయంలో చాలా మంది రాజకుటుంబీకులు బౌద్ధ సంఘంలో చేరారు. బుద్ధుని సోదరులైన ఆనందుడు, అనిరుద్ధుడు, నందుడు మొదలగు వారంతా బౌద్ధ సంఘములో చేరిసన్యాసులుగా మారారు. సిద్ధార్థుని కుమారుడైన

రాహులుడు కూడా బౌద్ధ మత సంఘములో చేరాడు. బుద్ధుని శిష్యులలో సరిపుత్త, మహా మొగ్గలన, మహా కశ్యప్, ఆనంద, అనిరుద్ధ మొదలగు ఐదుమంది ముఖ్యులు. వీరితో పాటూ ఉపాలి, సుభోతి, రాహుల, మహా కన, పున్న అనే ఐదుగురు సంగీత విద్వాంసులు ఉండేవారు..

బుద్దుడు మొదట స్త్రీలను సన్యాసినిలుగా తీసుకోవడానికి నిరాకరించాడు. ఆనందుని మధ్యవర్తిత్వంతో, స్త్రీలకు కూడా జ్ఞాన సముపార్జనకు సమాన శక్తి ఉందని బుద్ధుడు గ్రహించి, వారికి కూడా బౌద్ధ సంఘంలో స్థానం కల్పించాడు. కానీ బుద్ధుడు, బౌద్ధ సంఘానికున్న నియమాలతో పాటు, వినయమనే కొత్త నియమాన్ని, స్త్రీలకు ప్రత్యేకంగా జతపర్చాడు. తర్వాత సిద్ధార్థుని భార్య యశోధర కూడా బౌద్ధ సన్యాసినిగా మారింది. మహా పరనిభాన సూక్తం ప్రకారం, గౌతమ బుద్ధుడు, తన 80వ ఏట తాను కొద్ది రోజులలో మహా నిర్వాణమొందుతానని ప్రకటించాడు. తర్వాత, బుద్ధుడు కుంద అనే కుమ్మరి సమర్పించిన ఆహారాన్ని భుజించాడు. అదితిన్న తర్వాత బుద్ధుడు చాలా అస్వస్థతకు గురయ్యాడు. అప్పుడు బుద్ధుడు తన ముఖ్య అనుచరుడయిన ఆనందుని పిలిచి, తన అస్వస్థతకు కారణం, కుంద ఇచ్చిన ఆహారం కాదని, తనకు ఆఖరి భోజనాన్ని సమర్పించిన కుంద చాలా గొప్పవాడని చెప్పి, కుందని ఒప్పించమని పంపాడు. కానీ మహాయాన విమల కీర్తి సూక్తం ప్రకారం,

ఖద్దరు వెనుక కన్నీటి గాథలెన్నో...

- స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చ - మహమ్మద్ అంకూస్ ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

జమ్మికుంట (ప్రజా మంటలు):
రాజకీయ నాయకులు ఎంతో ఆర్భాటంగా తొడిగే ఖద్దరు చొక్కా వెనుక ఇతరులెవ్వరికి తెలియని కన్నీటి బాధలెన్నో ఉన్నాయి. రాజకీయం అనే రంగుల సముద్రంలో ఈదలేక అలసిపోతున్న రాజకీయ ఉద్దండులెందరో ఒడ్డున కూర్చుని వెనక్కి రాలేకా, ముందుకు వెళ్లలేక నిరీక్షిస్తున్న సందర్భాలను మనం సమాజంలో ఎన్నో చూస్తున్నాం. రాజకీయం అంటే అదేదో అద్భుత లోకమని భావించి యాదృచ్ఛికంగా ఆ రంగంలో ప్రవేశించి తీరా పీకల్లోతు కూరుకుపోయిన తర్వాత కానీ వెనక్కి రాలేమని తెలుసుకొని, మునుపటి జీవితం కోసం నిరీక్షిస్తున్న రాజకీయ బాధితు లెందరో మనకు తారసపడతారు. అటువంటి వారి జీవితాల్లోకి తొంగి చూస్తే వారు పంటి బిగువున భరిస్తున్న బాధలెన్నో మనకు తెలుస్తాయి.

జీవితాలు అతలాకుతలం..
రాజకీయ మోజు ఎందరో జీవితాలను అతలాకుతలం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఉన్నత స్థానంలో ఉన్న రాజకీయ నాయకుడి పరిస్థితి ఏమో కానీ, గ్రామ,మండల,జిల్లా స్థాయిలో రాజకీయం చేసే నాయకుల ఖర్చులు తడిసి మోపెడౌతున్నాయి. సర్పంచ్,ఎంపీటీసీ,ఎంపీపీ, జడ్పీటీసీ,సింగిల్ విండో చైర్మన్, నామినేటెడ్ పదవులు అనుభవించే వారు సైతం సంపాదించేది దేవుడెరుగు కానీ, కొందరు చేస్తున్న అడ్డగోలు ఖర్చులు మాత్రం వారికి గుదిబండలా మారుతున్నాయి. అధికార హోదా, దర్పం కోసం చేస్తున్న ఖర్చులు పెరిగి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. పదవుల మీద వ్యామోహంతో ఎన్నికల్లో తలపడి కోట్లు ఖర్చుపెడుతున్నారు. ఈ సందర్భంగా సంసార జీవితాలు అతలాకుత లమైన పట్టించుకోకుండా రాజకీయంలో ముందుకే వెళ్లాల్సిన పరిస్థితులు కొందరికి ఏర్పడుతున్నాయి. ఎన్నికల్లో ఓడిన వారు పెట్టిన ఖర్చు వెనక్కి రాక నష్టపోతే, గెలిచిన వారు హోదా తగ్గకుండా చేసే ఖర్చులతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

కారుంటేనే హోదా అనుకుంటున్నారు !
ఒకప్పటి రాజకీయాల్లో ఓ స్థాయికి ఎదిగిన నాయకులే కార్లు మెయింటెన్ చేసేవారు. కానీ నేటి రాజకీయాల్లో ఆ పరిస్థితి లేదు. గ్రామస్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ,ఇతర పదవుల్లో గెలిచిన వెంటనే దర్పం కోసం కార్లు కొంటున్నారు. ఇప్పుడున్న సమాజంలో లక్షో, రెండు లక్షలో చెల్లిస్తే కంపెనీలు వాయిదాల రూపంలో కార్లు ఇస్తున్నారు. ఈ రకమైన

వాయిదాలతో కొనుగోలు చేసిన కార్లతో రోజు ఐదు మందిని కారులో ఎక్కించుకుని వారి రోజువారీ ఖర్చులు నాయకుడే భరించటం నేటి రాజకీయాల్లో పరిపాటిగా మారింది. ఏమి లేదన్నా రోజుకు రూ,3 నుంచి 4 వేల వరకు గ్రామస్థాయి నాయకుడికి ఖర్చవుతుంది. ఎంత లేదన్నా నెలకు రాజకీయాల కోసం లక్ష మించకుండా ఖర్చు చేసే నాయకులు ఎందరో ఉన్నారు. ఈ విధంగా ఏడాది మెయింటెన్ చేసేలోపు అనుచర వర్గం ఖర్చులు, కారు కంటూ తడిసి మోపెడై ఇవన్నీ చెల్లించేందుకు చేతిలో చిల్లి గవ్వ లేక ప్రిస్టేజి కోసం పెద్దలు సంపాదించిన ఆస్తిని అమ్మో, తాకట్టు పెట్టో డబ్బులు సర్ది, తెల్లారేసరికి ఖద్దరు ధరించి నిన్నటి లాగే ముఖం మీద చిరునవ్వు చిందించు కుంటూ ప్రజలతో మమేకం అవుతున్న నాయకులు మన కళ్ళముందే ఉన్నారు. మరి కొందరైతే రాజకీయ హోదా తగ్గించుకోలేక, సంపాదన లేక పిల్లల చదువులు, పెళ్లిళ్లు అప్పులు చేసే గొప్పగా చేస్తున్నారు.

రాజకీయాల్లో ఆదాయం ఉంటుందా ?
వాస్తవంగా రాజకీయం అంటే సేవా దృక్పథం. క్రమంగా రాజకీయం ఒక ఫ్యాషన్ గా మారి కోట్ల సంపాదనకు పదవి కేంద్రబిందువుగా ఉందనే భ్రమలో గ్రామీణ నాయకులు,యువకులు మరికొందరు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. వాస్తవంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ గా గెలిస్తే కొంత ఆర్థిక అధికారం ఉంటున్నప్పటికీ, లక్షల, కోట్లు మిగిలించుకునే పరిస్థితులు ఇక్కడేమి ఉండవు. ఎంపీటీసీ పదవి అంటావా మండల స్థాయిలో ఎంపీపీని ఎన్నుకునేందుకు అవసరమైన సంఖ్యకు మాత్రమే ఉపయోగపడి ప్రత్యేకాధికారాలంటూ ఏమి ఉండని పదవి ఎంపీటీసీ. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 15వ, ఆర్థిక సంఘం గ్రాంట్ జనాభా ప్రకారం ఒక్కో మనిషికి సగటున ఏడాదికి రూ. 1610 చెల్లిస్తుంది.పంచాయతీకి పన్నుల ద్వారా, రాష్ట్ర గ్రాంట్ ల ద్వారా ఏడాదికి వచ్చే నిధులు రూ,2 లక్షల నుండి రూ. 5 లక్షలకు మించవు. ఈ నిధులన్నీ కూడా ప్రత్యేక నిబంధనల ద్వారానే ఖర్చు చేయాల్సి ఉంటుంది తప్ప, ఎన్నికైన సర్పంచ్ ఇష్టప్రకారమే మీ ఖర్చు చేసే అవకాశం ఉండదు. పదవీ కాంక్ష కోసం ఒక పంచాయతీకి ఏడాదికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా వచ్చే రూ,20,30 లక్షల నిధుల కంటే ఎన్నికల కోసం అభ్యర్థి చేసే ఖర్చు మాత్రం రూ,50 లక్షల వరకు ఉంటుందంటే రాజకీయాలు మనిషిని ఆర్థికంగా ఏ స్థాయికి దిగజారుస్తాయో అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

ఆలోచనా విధానాలు మారాలి....
రాజకీయాల్లో పోటీ చేసే నాయకులతో పాటు వారికి ఓటు వేసే ఓటరు ఆలోచనా విధానం కూడా మారినప్పుడే ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుంది. తాజాగా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు వస్తాయనే ప్రచారం జోరందుకుంది. ఏ ఒక్కరి నోట్లో చూసినా సర్పంచ్ ఎన్నికలు వస్తాయి, ఎవరు ఎంత ఖర్చు పెడతారో అనే చర్చ విస్తృతంగా జరుగుతుంది. ఓటుకు నోటు ఆశించకుండా అభివృద్ధి కోసం ఓటు వేస్తామని ఓటరు, తాను గెలిచేందుకు ఓటర్లను ఎటువంటి ప్రలోభాలకు గురిచేయనని నాయకుడు ప్రతిజ్ఞతో ఎన్నికల కార్యక్షేత్రం లోకి అడుగు పెట్టినప్పుడే అభివృద్ధి పరుగులు తీస్తుంది. ఖద్దరు చొక్కా కన్నీటి వ్యథ పటాపంచలౌతుంది.

కిరిమిష్ బాస్కెట్ బాల్ అకాడమీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాస్కెట్ బాల్ సమ్మర్ క్యాంప్

జగిత్యాల మే 21 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో కిరిమిష్ బాస్కెట్ బాల్ అకాడమీ ఆధ్వర్యంలో గత 21 రోజులుగా బాస్కెట్ బాల్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. క్రీడాకారుల సెలవులు సద్వినియోగం అయ్యేలా మరియు శారీరక దృఢత్వం, క్రీడా స్ఫూర్తి పెంపొందించేలా శిక్షణ ఉచితంగా నిర్వహిస్తున్నట్లు బెంగళూరు లోని ఎన్ఐఎస్ డిప్లమో క్వాలిఫైడ్ ట్రేనర్ కే. శ్రీరామ్ తెలిపారు. శిక్షణ కోసం స్టేడియం కు పంపడానికి క్రీడాకారుల తల్లిదండ్రులు సహకరిస్తున్నారని దీంతో అధిక సంఖ్యలో క్రీడాకారులు గ్రౌండ్ కు రాగలుగుతున్నారని నిరంతరం ఉచితంగా ఈ స్టేడియంలో క్రీడాకారులకు శిక్షణను ఇస్తున్నామన్నారు. ఇది తనకు ఎంతో సంతృప్తి కలిగిస్తుందని పేర్కొన్నారు. తీరిక వేళల్లో సెలవుల సమయంలో క్రీడాకారులు దురలవాట్లకు గురికాకుండా, క్రీడల్లో నిమగ్నము కావడంతో వారిలో నైతిక స్థైర్యం పెంపొందుతుందని అన్నారు. స్టేడియంలో బాస్కెట్ బాల్ శిక్షణ కోసం తనతో పాటు సీనియర్ క్రీడాకారుల సహకారంతోనే నిరంతర శిక్షణ కొనసాగుతున్నదని సీనియర్ క్రీడాకారులు ఎస్. శశి, డి. అనిల్, టి. లక్ష్మణ్, కే. సామంత్, పి. విజ్ఞాన్, సిహెచ్. సుధాకర్ మరియు విద్యార్థి (క్రీడాకారుల) తల్లిదండ్రులకు ట్రేనర్ కె. శ్రీరామ్ ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నేత చంద్రగిరి శ్రీనివాస్

జమ్మికుంట మే 21 (ప్రజామంటలు):
హైదరాబాద్ ఎమ్మెల్సీ క్వార్టర్స్ లో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ సమక్షంలో జమ్మికుంట గ్రామ పంచాయతీ (ప్రస్తుత మున్సిపాలిటీ) మాజీ వార్డ్ సభ్యులు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ (30వ వార్డ్), టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ చంద్రగిరి శ్రీనివాస్ కి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు. చంద్రగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ%%%. గతంలో జమ్మికుంట గ్రామ పంచాయతీ (కాంగ్రెస్ పార్టీ) వార్డ్ సభ్యునిగా పని చేసిన సమయంలో జమ్మికుంట పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేసినాను. 2006 లో జమ్మికుంట గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన సర్పంచ్ గా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయాను. కొన్ని అనివార్య కారణాల వలన టిఆర్ఎస్ పార్టీ లోకి చేరడం జరిగింది. ఇప్పుడు నా స్వంత గూటికి కాంగ్రెస్ పార్టీ లోకి ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం చాలా సంతోషంగా వుంది. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ నాయకత్వం లో జమ్మికుంట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా బల్మూర్ వెంకట్ కి పూలగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో ఈ నా చేరిక జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కసుబోజుల వెంకన్న అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ కోఆర్డినేటర్ చిన్నింటి నాగేంద్ర, తంగెళ్ళ రాజు, చిక్కుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాల కే రూ. 500 బోనస్ ఇస్తామనడం మంచి నిర్ణయం

యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మహమ్మద్ సజ్జద్

జమ్మికుంట మే 21(ప్రజామంటలు):
సన్న వడ్లకు 500రూపాయలు బోనస్ ఇస్తమానటం చాలా మంచి నిర్ణయం అని యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు మహమ్మద్ సజ్జద్ పేర్కొన్నారు. విలేకరులతో మాట్లాడు తూ.... రైతులు ఎందుకంటే దొడ్డు వడ్లు పండిస్తే దొడ్డు వడ్లు మనం తినలేం. అదే సన్న వడ్లకు పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. దిగుబడి తక్కువగా ఉంటుంది కాబట్టి వారికి ఇవ్వడం సరైన నిర్ణయం. అలాగే ముఖ్య విషయం గమనించాల్సింది ఏంటిది అంటే సన్న వడ్లు పండించేలారైతులను ప్రోత్సహించడం ద్వారా.. జనాలందరికీ రేషన్ బియ్యం ద్వారా సన్న బియ్యం ఇవ్వచ్చు, అలాగే ప్రభుత్వ హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు మంచి నాణ్యమైన సన్నబువ్వతో భోజనం పెట్టొచ్చు.. అలాగే పట్టణాల్లో క్వింట సన్న బియ్యం ధర ఈరోజు చుక్కలను అంటుతున్నవి. లాభాలకు ఆశపడి దొడ్డువడ్లు పండించి ఇతరులకు అమ్మే కంటే.. సన్న వడ్లు పండించుకుని జనాలందరూ కడుపునిండా భోజనం చేసేలా ఉంటుంది. అలాగే పట్టణాల్లో నివసించే మధ్యతరగతి వారికి కూడా సన్న బియ్యం ధర తగ్గుతుందని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా శ్రేయస్కరం అని తెలిపారు.

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

చిత్ర పటానికి పుల మాలలు వేసి నివాళులు

జగిత్యాల మే 21 (ప్రజా మంటలు):
జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్ రెడ్డి అధ్వర్యంలో దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పుల మాలలు వేసి, మౌనం పాటించి, నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ%%%. రాజీవ్ గాంధీ భారత దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికారు. ప్రపంచ శాంతి నెలకొల్పేందుకు కృషి చేశారు.స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేశారు.కేంద్రం నుండి నేరుగా స్థానిక సంస్థలకు నిధులు అందించేందుకు మార్గం సుగమం చేశారు. అన్నివర్గాల ప్రజలకు మత స్వేచ్ఛ కల్పించారు. ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యం పెంచేందుకు ఓటు హక్కును 21 ఏళ్ల నుండి 18 ఏళ్ళకు తగ్గించారు. భారత దేశంలో సాఫ్ట్ వేర్ రంగానికి పునాది బాటలు వేశారు. 1986లో అయోధ్య లో రామ మందిరం తలుపులు తెరిచారు. రామ మందిర

నిర్మాణానికి కృషి చేశారు.1989 లో అయోధ్యలో శిలా న్యాస్ నిర్వహించారు. ప్రతిపక్ష నేతగా పార్లమెంట్ ను గౌరవించిన ప్రజాస్వామ్య వాది రాజీవ్ గాంధీ. ప్రతి భారతీయ పౌరుడు ఆదర్శంగా తీసుకునే గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ. ప్రపంచ శాంతి దూత రాజీవ్ గాంధీ. ప్రతి ఒక్కరూ రాజీవ్ గాంధీ బాటలో నడువాలని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు.

ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం

పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

వరంగల్ /జగిత్యాల మే 21 (ప్రజామంటలు):
వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి కి మద్దతుగా వరంగల్ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లు బాల్క సుమన్, నన్నపునేని నరేందర్, కరీంనగర్ మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ లు మసూద్, హరి శంకర్, నాయకురాలు రమాదేవి, జగిత్యాల బి ఆర్ ఎస్ నాయకులు దావ సురేష్, పాలెపు రాజేంద్ర ప్రసాద్, ఎల్. కార్తీక్, చెట్ పెల్లి సుధాకర్, ప్రభాత్ సింగ్ ఠాకూర్, శరత్ రావు, ఎల్ల రాజన్న, దమ్మ రాజీ రెడ్డి, ఏనుగుల రాజు, చిట్ల మనోహర్, కార్పొరేటర్ లు, డివిజన్ ఇంచార్జిలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మానేరు నది ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ తీర్పు హర్షణీయం

- జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి
- అక్రమ కేసులను ఎత్తివేయాలి
- ఇసుక మాఫియా పై సీఎం రేవంత్ రెడ్డి కి వినతి

జమ్మికుంట మే 21 (ప్రజామంటలు):
గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై అధికారులు, నాయకులు ఒక్కొక్కరుగా మూల్యం చెల్లించుకోవాల్సిన సమయం వచ్చిందని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి పేర్కొన్నారు. మానేరు నదిలో ఇసుక త్రవ్వకాలు చట్ట విరుద్ధమని నేడు ఎన్జీటీ తీర్పులో పేర్కొనడం హర్షనీయమని అన్నారు. గత ప్రభుత్వం ఇసుక మాఫియా తో కుమ్మక్కై వేల కోట్ల రూపాయల అక్రమార్కులకు పాల్పడిందని ఆయన పేర్కొన్నారు. డీసిల్టేషన్ పేరుతో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా తాను రైతాంగం పక్షాన ఉద్యమించానని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం అండదండలతో మానేరులో ఇసుక విధ్వంసానికి పాల్పడుతూ కాంట్రాక్టర్లు వేల

కోట్ల అక్రమార్జనకు పాల్పడి, తీర ప్రాంత రైతాంగ ఉపాధులను దారుణంగా దెబ్బతీశారని వాపోయారు. ఇసుక కాంట్రాక్టర్ల వేలకోట్ల అక్రమార్జనలను తాను సాక్ష్యాలతో సీఎంకు అందజేశానని ,విచారణ జరుగుతు న్నదని తెలిపారు. ఎన్జీటీ ఇచ్చిన తీర్పు గత ప్రభుత్వానికి చెంప పెట్టని ఆయన తెలిపారు. ఎన్జీటీ తీర్పు నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గతంలో తనుగుల వద్ద ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇసుక మాఫియా పై ఉక్కు పాదం మోపాలని అంతేకాకుండా ఎన్జీటీ విధించిన 50 కోట్ల జరిమాన అక్రమాలకు పాల్పడిన అధికారుల నుండి వసూలు చేసి మానేరు తీర ప్రాంత బాధిత రైతాంగానికి నష్టపరి హారంగా చెల్లించాలని ఆయన కోరారు. పర్యావరణ విధ్వంసానికి పాల్పడితే తమ ప్రభుత్వం తగిన గుణపాఠం చెబుతుందని ఆయన ఇసుకాసు రులను హెచ్చరించారు. ఇసుక మాఫియా కు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారులపై గత ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించారు. మొక్కవోని ధైర్యంతో న్యాయ పోరాటాన్ని కొనసాగించి విజయం సాధించిన మానేరు పరిరక్షణ సమితి నాయకులు సంధి సురేందర్ రెడ్డి, చిటికేసి సతీష్ కుమార్ లను ఆయన అభినందించారు.

రాయపట్నం బ్రిడ్జి క్రింద గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 21 (ప్రజా మంటలు):

ధర్మపురి మండల పరిధిలోగల రాయపట్నం బ్రిడ్జి క్రింద గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం. ఈ వ్యక్తి వయస్సు సుమారు 40 నుంచి 45 మధ్య కలదు. ఈ శవాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గల మార్చరీ గదిలో భద్రపరచడం జరిగింది. ఈ వ్యక్తి గురించి తెలిసినవారు ధర్మపురి పోలీస్ స్టేషన్ నందు సంప్రదించగలరు అని ధర్మపురి యస్.ఐ. పి. ఉదయ్ కుమార్ (8712656824) తెలిపారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

రామ కిష్టయ్య సంగన భట్ల

ధర్మపురి మే 21 (ప్రజామంటలు):
గాయత్రి బ్యాంకు ఖాతాదారులైన ఆకుబత్తిని కొమురయ్య ప్రమాదవశాత్తు మరణించగా మృతునికి ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో గాయత్రి నిర్భయ సేవింగ్ పై గల ప్రమాద బీమా సౌకర్యం ద్వారా మృతుని భార్య వరలక్ష్మికి 1లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కును బ్రాంచి మేనేజర్ ఒజ్జల మోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మోహన్ మాట్లాడుతూ... ఖాతాదారులకు కనీస డిపాజిట్ తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్యతరగతి వినియోగదారులకు ప్రమాద భీమా కల్పిస్తూ వారికి అండగా తమ బ్యాంకు

నిలుస్తున్న దన్నారు.గాయత్రి బ్యాంకు వినియోగదారుల ఆర్థిక ప్రగతికి సహకారం అందిస్తుందన్నారు. 24 గంటల ఏ టి ఏం లలో నగదు అందుబాటులో ఉంచడం ద్వారా ధర్మపురి మరియు పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీరుస్తున్నామన్నారు. వినియోగదా రులకు అన్నిరకాల సేవల ద్వారా వినియోగ దారులకు చెల్లింపులు వేయడం జరుగుతుందని, తక్కువ వడ్డీకి బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా రూ. 5,000 తో రుణాలను అందిస్తున్నామని తెలిపారు. అలాగే రైతులకు వ్యవసాయ రుణాలను కూడా అందిస్తున్నారని తెలిపారు. ధర్మపురి పరిసర గ్రామాలలో 17 బ్యాంకింగ్ కరెస్పాండెంట్ లను నియమించామని, తద్వారా పెన్షనర్లు మరియు ఇతర ఖాతాదారులు బ్యాంకింగ్ కరెస్పాండెంట్ వద్ద బ్యాంకు లావాదేవీలను నిర్వహించుకోవచ్చని తెలిపారు. సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో, జిరాక్సును బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామని, వ్యాపారస్తులకు వ్యాపార వృద్ధికై ఋణాలను అందిస్తున్నామని, అలాగే కిసాన్ వికాస్ పత్రాలు మరియు పోస్టు ఆఫీస్డి డిపాజిట్లపై కూడ కేవలం 0.83 పైనబడే అనగా 10 శాతం పి.ఏ. రేటుకి ఋణ సౌకర్యం అందిస్తున్నామని వినియోగదారులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు.

నేడు నరసింహ స్వామి జయంతి

జయంతి సందర్భంగా తెలుగు పండితులు చెరుకు మహేశ్వరశర్మ అందించిన ప్రత్యేక కథనం

స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సర వైశాఖ శుద్ధ చతుర్దశి బుధవారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఈ ఉత్సవాలను తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు ఘనంగా నిర్వహిస్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధర్మపురి, నాంపల్లి, నల్లగొండ, సుందిళ్ళ, తదితర ప్రాంతాల్లో చారిత్రక ప్రాధాన్యం గల నరసింహ స్వామి దేవాలయాలు నెలకొన్నాయి. రాయికల్ మండలం లోని భూపతిపూర్, రామాజీపేట తదితర గ్రామాల్లో నరసింహస్వామి ఆలయాలు ఉన్నాయి. విష్ణుమూర్తి అవతారాలలో చాలా ముఖ్యమైన, శక్తివంతమైన నాల్గవఅవతారము నరసింహస్వామి అవతారమని మహేశ్వరశర్మ వివరించారు. శరీరం సగ భాగం మనిషి ఆకారం, సగ భాగం సింహ రూపంలో దర్శన మిస్తారు. హిరణ్యకశ్యపుడి సంహారానికై విష్ణుమూర్తి ఈ రూపంలో అవతరించాడని మహాభాగవతం లో పేర్కొన్నారు. హిందు పురాణాల ప్రకారం పూర్వం కశ్యపుడనే మహర్షి కి భార్య దితి, ఇద్దరు కుమారులు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు అని ఉండేవారు. విష్ణుభగవానుడు లోకకళ్యాణార్థం రాక్షసుడైన హిరణ్యాక్షుడుని సంహరించాడు. ఇది భరించలేని సోదరుడైన హిరణ్యకశ్యపుడు విష్ణుమూర్తితో వైరం పెంచుకున్నాడు. కోపోద్రిక్తుడైన హిరణ్యకశిపుడు తీవ్ర తపమొనర్చి బ్రహ్మను ప్రత్యక్షం గావించుకొ న్నాడు. బ్రహ్మ వలన అతను మనుజులతోనూ జంతువుల తోనూ దేవతలతోనూ రాక్షసులతోనూ



పగలు కాని రాత్రి కాని భూమి పైన కాని ఆకాశంలో కానీ ఆయుధాలతో కాని ఇంటిలో కానీ బయటకాని తనచావు రాకుండా వరం పొందిన హిరణ్యకశిపుడు అన్ని లోకాలను శాసించసాగాడు. దేవతలను, మునులను, ఋషులను బాధించసాగాడు. చివరకు దేవలోకంలో ఇంద్రునితో సహా అందరు నిస్సహాయ స్థితిలో రాక్షసుల ఆగడాలను భరించసాగారు. ఆ సమయంలో హిరణ్యకశిపుని భార్య లీలావతి మగపిల్లవాడు ప్రహ్లాదుడికి జన్మనిచ్చింది. ఆ పిల్లవాడికి ఈ రాక్షస ప్రవృత్తులు ఏమే అంటలేదు. అతడు పూర్తిగా విష్ణుమూర్తి భక్తుడయ్యాడు. హిరణ్యకశిపుడు శతవిధాల ప్రహ్లాదుని విష్ణుభక్తి నుండి మరల్చుదామని ప్రయత్నించాడు. ఎన్నిమార్లు ప్రయత్నించిన విఫలమౌతూనే ఉన్నాడు. తండ్రి ప్రయత్నిస్తున్నకొద్దీ ప్రహ్లాదునిలో భక్తి మరింత ఎక్కువ కాసాగింది. ప్రహ్లాదుని మృత్యువు వరకు తీసుకువెళ్లినా అతనిలో ఏమార్పూ లేదు. విషప్రయోగం చేసినా, ఏనుగులతో తొక్కించినా లోయలో పడవేసినా ఎప్పటికప్పుడు విష్ణుమూర్తి రక్షిస్తు ఉండేవాడు. ప్రహ్లాదుని నారాయణ మంత్రం విన్నమీదట కోపంతో తన కుమారుని పరిపరివిధాల మృత్యు సమీపానికి దండించే నిమిత్తం అనేక శిక్షలు వేసాడు. కాని ప్రహ్లాదుని భక్తివల్ల ఆ శిక్షలు అతని కిఏమి హాని చేయలేదు. విసిగిపోయిన హిరణ్యక శిపుడు నీ విష్ణువు ఎక్కడ ఉన్నాడో చెప్పమంటాడు. ఇందుగలదని అందు లేదని సందేహము వలదు,చక్రి సర్వోపగతుండు ఎందెందు వెదికిన అందందే కలడు. నా శ్రీహరి అని అంటాడు ప్రహ్లాదుడు. దానితో మరింత ఆగ్రహావేశాలకు లోనైన హిరణ్యకశిపుడు ఐతే ఈ స్థంభంలో ఉంటాడా నీ శ్రీ హరి అని అడిగి ఉంటాడు అని ప్రహ్లాదుడు అనేసరికి ఒక్కపెట్టున ఆ స్థంభాన్ని తన గదతో పడగొడతాడు. అంతే భయంకరాకారుడై, తల సింహం రూపంలో మొండెం మనిషి ఆకారంలో గర్జిస్తూ నరసింహస్వామి అవతారంగా ద్వారం వద్ద ఒక్క ఉదుటున ఆ రాక్షసుడిని తన తొడలమీద పరుండబెట్టి ఆయన వాడి గోళ్లతో అతని వక్షస్థలాన్ని చీల్చి చెండాడి హిరణ్యకశిపుడిని అంతమొందిస్తాడు. వైశాఖ శుద్ధ చతుర్దశి రోజున నరసింహస్వామి అవతారంగా స్వామి ఆవిర్భావం జరిగింది అని పురాణాలు చెపుతున్నాయి. అనంతరం ప్రహ్లాదుని ఆశీర్వదించి ఎవరైతే నరసింహస్వామి జయంతి రోజున నా నామసంకీర్తనతో ఉపవసించి ఉంటారో వారి సమస్యలు, బాధలు తొలగిపోతాయి అని శలవిస్తారు. కావున ఈ శుభదినాన్ని మనం అందరం నరసింహజయంతిగా జరుపుకుంటున్నాము. ఈ రోజున స్వామివారి శాంతి కొరకు పానకం నివేదిం చడం ఆనవాయితీగా వస్తోంది. మనం భగవంతుడికి పండ్లు, పూలు, దక్షిణ తాంబూలాలను భక్తి తో సమర్పించుకోవాలి. మనం ఎంత సమర్పిం చాము, ఏమి సమర్పించాము అనే లౌకికమైన భావనలకంటే ముఖ్యమైనది మన హృదయాంజలి. మనసా, వాచా, కర్మణా స్వామికి ఏకాగ్ర చిత్తంతో ఆత్మ నివేదనం చేసి పూజించే వారికి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పురోహితులు చెరుకు మహేశ్వరశర్మ వివరించారు.

"ఉగ్రంవీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖం నృసింహ భీషణం భద్రం మృత్యు మృత్యుం నమామ్యహం!! "

కృష్ణానగర్ కాలనీలో వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ మే 21 (ప్రజామంటలు):

గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాంధీ నగర్ ఇన్ స్పెక్టర్ డి. రాజు కథనం ప్రకారంకామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం సంగోజివాడీ గ్రామానికి చెందిన గడ్డం శివరాజు (45) అనే రైతు ఈనెల 15న కోడలు డెలివరీ కోసం కుమారుడు నితిన్ తో కలసి గాంధీ ఆసుపత్రికి వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఆసుపత్రిలో ఎవరికి చెప్పకుండా బయటకు వచ్చిన శివరాజు గాంధీ ఆసుపత్రి కి ఎదురుగా ఉన్న కృష్ణానగర్ కాలనీలో రాడుకు షర్ట్ తో ఉరివేసుకొని విగత జీవిగా కనిపించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హెచ్వో డి.రాజు తెలిపారు.

ఘనంగా సుంకపాక సూర్యనారాయణ జయంతి వేడుక

సికింద్రాబాద్ మే 21 (ప్రజామంటలు):

స్వామి వివేకానంద సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, సంఘ సేవకులు దివంగత సుంకపాక సూర్యనారాయణ 67 వ జయంతి వేడుక మంగళవారం బన్సీలాల్ పేటలో ఘనంగా నిర్వహించారు. కుమారుడు సుంకపాక వినయ్ కుమార్, ఫ్యామిలీ మెంబర్స్ తో కలసి భోలక్ పూర్ లోని ఆగ్జిలియం నవజీవన్ అనాథ బాలికల ఆశ్రమంలో విద్యార్థినులకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యనారాయణ చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సుంకపాక రాజు (టైసన్), సుంకపాక గురు సాయి శరన్, కొంగరి సతీష్, సెల్వరాజ్, న్యాయవాది ప్రవీణ్ కుమార్, తులసి రామ్, సునీల్ పాల్గొన్నారు.

టి.ఎస్. స్థానంలో టి.జి. తక్షణమే అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

జగిత్యాల మే 21 (ప్రజామంటలు):

టి.ఎస్. స్థానంలో టి.జి.ని తక్షణ మే అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష అధికారులను ఆదేశించారు. టి.ఎస్. స్థానంలో టి.జి.ని అమ లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని శాఖల అధికా రులు తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రియేషన్స్ సూచించే "టి.ఎస్." స్థానంలో టి.జి. ని వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలుబడ్డాయని తెలిపారు. జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, వెబ్ సైట్లు, ఆన్ లైన్ ప్లాట్ ఫారమ్లు ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్ ను టి.ఎస్. బదులుగా టి.జి. ని వాడాలని కలెక్టర్ కోరారు. లెటర్ హెడ్లు , రిపోర్టులు , నోటిఫికేషన్లు, అధికారిక వెబ్ సైట్లు, ఆన్ లైన్ ప్లాట్ ఫార్మ్, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లు అన్నింటిపై టి.ఎస్. స్థానంలో టి.జి.గా మార్చాలని కలెక్టర్ పేర్కొ న్నారు. శాఖల ద్వారా భవిష్యత్తులో నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాలలో టి.ఎస్. కు బదులుగా టి.జి.ని ముద్రించాలని సూచించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై ఈ నెల 25 వ తేదీలోపు అన్నీ శాఖల అధికారులు నివేదికలు పంపాలని, అట్టి నివేదికలు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆలయానికి లక్ష రూపాయలతో స్ట్రీట్ లైట్ ఏర్పాటు చేసిన శివ

భీమదేవరపల్లి మే 21 (ప్రజామంటలు):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి శివ రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి ఆర్థిక సహాయం చేసి తన భక్తిని చాటుకున్నారు. గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయనికి స్ట్రీట్ లైట్ కు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు, ఆలయ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా జాతర ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

జూన్ 2న మాంసం, మద్యం షాపులను మూసివేయాలి

అమర వీరుల త్యాగాలను తెలిపేలా కార్యక్రమాలను నిర్వహించాలి

స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ వై. సంజీవ్ కుమార్

సికింద్రాబాద్ మే 21 (ప్రజామంటలు): అమరుల జ్ఞాపకార్థంగా,

భారతావనికి స్వాతంత్రం సిద్ధించిన శు భసూచికంగా ఆగస్టు 15, జనవరి 26న మద్యం, మాంసము దుకాణాలు మూసివేస్తున్నట్లుగానే ఎందరో అమరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు జూన్ 2 న కూడ మద్యం, మాంసం దుకాణాలను మూసివేయాలని స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ వై. సంజీవ్ కుమార్ కోరారు. ఈమేరకు ఎక్స్, ఈమెయిల్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు లేఖ రాశారు. జూన్ 2న తెలంగాణ అమర వీరుల త్యాగాలను, వారి పోరాట పటిమను ప్రజలకు, ముఖ్యంగా చిన్నారి విద్యార్థులకు తెలిపేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి

కరీంనగర్ మే 21 (ప్రజామంటలు):

18 సంవత్సరాలు దాటిన యువతకు ఓటు హక్కు కల్పించిన గొప్ప నేత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూరు శాసనసభ్యులు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ అసెంబ్లీ నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్ తో పాటు పలువురు నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కవ్వంపల్లి సత్యనారా యణ మాట్లాడుతూ భారతదేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పరితపించిన మహానేత రాజీవ్ గాంధీ, ఈ దేశంలో సాంకేతిక విప్లవానికి పునాది వేసి అమెరికా లాంటి అగ్రరాజ్యాల సరసన నిలబెట్టిన ఘనత ఆయనదని కొనియాడారు.. ఈ దేశ సమగ్రత కోసం, ఐకమత్యం కోసం ప్రజాస్వామ్య పరిర

క్షణ కోసం 18 సంవత్సరాలు దాటిన యువతకు ఓటు హక్కు కల్పించిన రాజీవ్ గాంధీ పేరు ఈ విషయంలో సూర్యచంద్రులు ఉన్నంత వరకు నిలిచి ఉంటుందని వారు చేసిన సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరిచి పోరని నేడు రాజీవ్ గాంధీ వర్ధంతి సంద ర్భంగా వారిని స్మరించుకుంటూ ఘన నివాళు లు అర్పించారు. అనంతరం పిసిసి కార్యదర్శి వైద్యులు అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నగరం లోని రాజీవ్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిసిసి అధ్యక్షులు డాక్టర్.కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్ర సత్య ప్రసన్న రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, మడుపు మోహన్, సిరాజు హుస్సేన్, ఆకారపు భాస్కర్ రెడ్డి, వెన్న రాజ మల్లయ్య, బొబ్బిలి విక్టర్, కల్వల రామ్ చందర్, ముస్తాక్, రామిడి రాజిరెడ్డి అమ్మద్ అలీ, పడిశెట్టి భూమయ్య, జనగామ సతీష్ రావు, వంగల విద్యాసాగర్, ఇమ్రాన్, బసవరాజ్ శంకర్, గంగుల దిలీప్, దిండిగాల మధు, మాదాసు శ్రీనివాస్, దీకొండ శేఖర్, బాల భద్ర శంకర్, నెల్లి నరేష్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, చింతల కిషన్, జొన్నల రమేష్, కుంభాల రాజకుమార్, రూపు రెడ్డు శ్రీనివాసరెడ్డి, పోకల లక్ష్మీనారాయణ, బండ శకుంతల, అస్తపురం తిరుమల, మన్నే జ్యోతి రెడ్డి, కటకం కృష్ణ, హరీ ష్, వసీం, శిల్ప,పాల్గొన్నారు.

18 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రుల ఆత్మీయ ఆనందం

2006-07 పదవ తరగతి విద్యార్థులు

భీమదేవరపల్లి మే 20 (ప్రజామంటలు):

మండలంలోని మల్లారం గ్రామంలో 2006-07 పదవ తరగతి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యా ర్థులు ఆత్మీయ సమ్మే ళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించు కున్నారు. సుమారు 18 ఏళ్ల తర్వాత ఒకరికొకరు కలుసుకుని యోగ క్షేమాలు అడిగి చిన్ననాటి తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులంతా కలిసి గురువులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా 18 ఏళ్ల సుదీర్ఘ సమయం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల ముఖాల్లో ఆనందం, సంతోషమనే వెలుగులు కనిపించాయి. ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆనందాన్ని వ్యక్తం చేశా రు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

గత నెలలో పోగొట్టుకున్న మొబైల్ అందజేసిన సి.ఐ. వేణు గోపాల్

జగిత్యాల మే 21 (ప్రజామంటలు):

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితునికి జగిత్యాల పట్టణ సిఐ వేణు గోపాల్ సిఐఈఆర్ యాప్ ద్వారా మొబైల్ ఫోన్ గుర్తించి మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. గత నెల రోజుల క్రితం ఎల్లాల గోపాల రెడ్డి అను వ్యక్తి మొబైల్ ఫోన్ పోగొట్టుకుని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. సిఐ ఈఆర్ యాప్ ద్వారా మొబైల్ ఫోను ట్రేస్ చేసి వన్ ప్లస్ మొబైల్ ఫోను ను జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ లో సిఐ ఆ మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తి కి అందజేశారు.

కేయూ ఇంచార్జ్ వీసీగా వాకటి కరుణ

ఇన్‌ఛార్జ్ వీసీ లుగా సీనియర్ ఐఏఎస్ అధికారుల నియామకం

హనుమకొండ మే 21 (ప్రజామంటలు):

కాకతీయ యూనివర్సిటీ ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్ ఐఏఎస్ వాకాటి కరుణ ను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల వీసీ ల పదవి కాలం ముగియడంతో ఐఏఎస్ లను ఇన్చార్జ్ వీసీ ల నియమించాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. కేయూ లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను నూతన కేయూ ఇంచార్జ్ వీసీ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. గతంలో వీసీ గా పనిచేసిన తాటికొండ రమేష్ పై ప్రభుత్వం ఎంక్వైరీ ఆదేశించింది. గత ప్రభుత్వంలో చాలా కాలంగా పలు యూనివర్సిటీలకు వైస్ ఛాన్సర్లు లేని కారణంగా రాష్ట్రంలోని10 యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జ్ వీసీలను నియమించింది. దీంతో ఇన్చార్జి వైస్ ఛాన్సర్ ల పాలన మొదలు కానుంది. రాష్ట్రం లోని ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా దాన కిషోర్, జేఎన్‌టీయూ వీసీగా బి. వెంకటేశం, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా రిజ్వి, తెలంగాణ యూనివర్సిటీ వీసీగా సందీప్ సుల్తానియా, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వీసీగా శైలజా రామయ్యర్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీగా నవీన్ మిట్టల్, శాతవాహన యూనివర్సిటీ వీసీగా సురేంద్ర మోహన్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీ వీసీగా జయేష్ రంజన్, పాలమూరు యూనివర్సిటీ వీసీగా నదీం అహ్మద్ లను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఎక్స్ ఖాతా నుంచి గాంధీ ఫేక్ వీడియో తొలగింపు

- ఫేక్ వీడియో వైరల్పై పోలీసులకు సూపరింటెండెంట్ ఫిర్యాదు - ఐటీ, ఐపీసీ 505 క్లాస్ 2 సెక్షన్ల కింద కేసు నమోదు

సికింద్రాబాద్ మే 21 (ప్రజామంటలు):

రాష్ట్ర ప్రభుత్వ పనితీరు అధ్వాన్నంగా ఉందని, గాంధీ ఆసుపత్రిలో కరెంట్ లేక క్యాండిల్స్, టార్చిలైట్లు, మొబైల్ వెలుగులో పేషంట్లకు ట్రీట్మెంట్ చేస్తున్నారని, ఈ క్రమంలో ఓ బాలుడు చనిపోయాడని అంటూ ఎక్స్ (ట్విట్టర్) లో వైరల్ అయిన ఫేక్ వీడియోను ఎట్టకేలకు బీఆర్ఎస్ యూఎస్ఏ ఎక్స్ ఖాతా నుంచి హరీష్ రెడ్డి తొలగించారు. తనకు తెలియక, పొరబాటున పాత వీడియోను వెరిఫై చేసుకోకుండా ఎక్స్ లో పోస్టు చేశానని, ఇందుకు అపాలజీ చెబుతున్నానంటూ హరీష్ రెడ్డి మంగళవారం ఎక్స్ లో మరో వీడియో పోస్టు చేశారు. సూపరింటెండెంట్ పై కాంగ్రెస్ నేతలు ఒత్తిడి తెచ్చి తనపై కేసు పెట్టిం చారన్నారు. కేసు నమోదు కాకముందే తాను ఎక్స్ అక్కౌంట్ నుంచి సదరు వీడియోను తొలగించానని చెప్పారు. వాస్తవంగా తనపై కేసులు పెట్టడం కాదని, కోట్లాది మంది ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై అనేక కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ పనితీరు దరిద్రంగా ఉంది:

ఎన్నికల సమయంలో అది చేస్తా, ఇది చేస్తా నంటూ గొప్పలు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు దరిద్రంగా ఉందని, గుంపు మేస్త్రీ ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తూ హరీష్ రెడ్డి బీఆర్ఎస్ యూఎస్ఏ ఎక్స్ ఖాతాలో గాంధీ ఆసుపత్రికి సంబందించినదంటూ ఓ వీడియోను జతచేస్తూ గత

మూడు రోజుల క్రితం పోస్టు పెట్టారు. అయితే దీనిపై సీఎం ఆఫీస్ విచారణ చేపట్టగా, ఇదంతా నిజం కాదని, పాత క్లిప్పింగ్ లతో డీప్ ఫేక్ ద్వారా తప్పుడు వీడియోను క్రియేట్ చేశారని ఎంక్వైరీలో తేలింది. ఈ మేరకు సీఎం పేషీ ఆదేశాల మేరకు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ చేశారు. బీఆర్ఎస్ యూఎస్ఏ ఎక్స్ ఖాతాలో హరీశ్ రెడ్డి అనే వ్యక్తి ఈ ఫేక్ వీడియోను అప్ లోడ్ చేసినట్లు గుర్తించిన పోలీసులు ఐటీ, ఐపీసీ 505 క్లాజ్ 2 సెక్షన్ల కింద హరీశ్ రెడ్డి పై సైబర్ క్రైమ్ కేసు నమోదు చేశారు. హరీశ్ రెడ్డి అమెరికా నుంచి ఇండియాకు రాగానే అరెస్ట్ చేస్తామని చిలకలగూడ ఎస్హెచ్వో అనుదీప్ తెలిపారు. ఈ సెక్షన్ల కింద ఐదేండ్ల పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

గాంధీ ఆసుపత్రిపై నిందలు సరికాదు.

ఆసుపత్రి ప్రతిష్టను దెబ్బతీయవద్దు.

ప్రొ. రాజారావు, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్

పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఓ దేవాలయంగా పనిచేస్తున్న గాంధీ ఆసుపత్రిపై అనవసరంగా కొందరు పనిగట్టుకొని నిందలు వేయడం సరికాదు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ, వారి ప్రాణాలను కాపాడుతున్నాం. కోవిడ్ సమయంలోనైతే బెడ్ లు సరిపోలేనంత పేషంట్లు వచ్చినప్పటికీ అక్కున చేర్చుకొన్న మా వైద్య సిబ్బంది ప్రాణాలను తెగించి, వారిని కాపాడిన సంగతి తెలియంది కాదు. వైద్య సిబ్బందిని ప్రోత్సహించాల్సింది పోయి, వారిపై ఫేక్ అలిగేషన్స్ చేసి, డాక్టర్ల మనోధైర్యాన్ని, ఆసుపత్రి ప్రతిష్టను దెబ్బతీయవద్దు.

మండలంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

భీమదేవరపల్లి మే 21 (ప్రజామంటలు): మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టంపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ కొలుగూరి రాజు మాట్లాడుతూ%ఠ%. దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారు. దేశంలో బీదరికాన్ని పారదోలి, సాంకేతిక విప్లవానికి ఆధ్యులు, నవ భారత నిర్మాణ సారథి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. కంప్యూటర్ విద్యను అమలు చేసి, దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ కే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు చిదురాల స్వరూప, మాజీ ఎంపీపీ బొజ్జపురి అశోక్ ముఖర్జీ, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు ఆధరి రవి, మాడుగుల సంపత్

కుమార్, నగరబోని నాగరాజు, మాడుగుల గోపి, పోగుల శ్రీకాంత్, మడిపల్లె సదానందం, అఖిల్ పాషా, గట్టు ప్రభాకర్, గ్రామ శాఖ మహిళా అధ్యక్షురాలు స్వర్నలత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకొండ గ్రామంలో...

కొత్తకొండ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నవ భారత రూపకర్త మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు సిద్ధమల్ల వెంకటేష్, వీరభద్ర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పిడిశెట్టి కనకయ్య, మాజీ ఎంపీటీసీ కంకల సమ్మయ్య, కొత్తకొండ కాంగ్రెస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు సిద్ధమల్ల మండయ్య, కొత్తకొండ కాంగ్రెస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు సిద్ధమల్ల రాజమౌళి, కాంగ్రెస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు జోడుమంతల వెంకటస్వామి, కొత్తకొండ గ్రామ ఉపసర్పంచ్ సిద్ధమల్ల కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంగ సమ్మయ్య, బుర్ర సమ్మయ్య, సిద్ధమల్ల వీరస్వామి, కంకల సురేష్, పిడిశెట్టి శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫంక్షన్‌కు వచ్చి రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

జగిత్యాల మే 21 (ప్రజా మంటలు)

జగిత్యాల శివారు లోని లింగంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి చెందింది. పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన చిన్నారి మేనమామతో కలిసి ద్విచక్ర వాహనంపై అంతర్గాం గ్రామంలో జరిగిన ఫంక్షన్ కు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తిరిగి వస్తున్న క్రమంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో చిన్నారికి తీవ్ర గాయాలు కాగా జగిత్యాలలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లుగా ధ్రువీకరించారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

కడుపు కోత మిగిల్చిన శుభకార్యం

పెళ్ళి కోసం హైదరాబాద్ వెళ్లిన అన్నదమ్ములు

ఉప్పల్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి

హైద్రాబాద్ మే 21 (ప్రజామంటలు):

హైదరాబాద్ పీర్జాదిగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ జిల్లా కొడకండ్ల మండలం లోని రామవరానికి చెందిన అన్నదమ్ములు మృతి. శ్రవణ్ (29) హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ జాబ్ చేస్తుండగా శివ (27) రెండు నెలల క్రితం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లో హౌస్ సర్జన్ గా చేరాడు. ఓ శుభకార్యం కోసం శివ హైదరాబాద్ రాగా శ్రవణ్, భానుతో కలిసి బైక్ పై పీర్జాదిగూడ నుంచి ఉప్పల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ డివైడర్ వద్ద యూటర్న్ చేస్తుండగా బొలేరో వాహనం ఢీ కొట్టడంతో శివ, శ్రవణ్ అక్కడికక్కడే మృతి చెందారు. భాను పరిస్థితి విషమంగా ఉండటంతో హాస్పిటల్ లో చేర్చారు.

పెగడపల్లి మండల కేంద్రంలో పట్ట పగలు చోరీ



పెగడపల్లి మే 21 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం దొంగతనం జరిగింది. పెగడపల్లి బస్టాండు దగ్గరలో గల మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆరె దశరథం, బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆరె మహేందర్ కు చెందిన ఇంటిలో మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబీకులు ఉదయం 10:45 నిమిషాలకు ఇంటికి తాళాలు వేసుకొని మల్యాల మండల కేంద్రంలోని ఎల్లమ్మ టెంపుల్ వద్దకు దర్శనానికి వెళ్లి దర్శించుకుని తిరిగి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇంటికి చేరుకోగా, ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి ఉండెను. ఇది గమనించిన బాధిత కుటుంబం మల్యాల సిఐకి, పెగడపల్లి ఎస్సైకి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందంతో వచ్చి తనిఖీలు నిర్వహించారు. ఒక 1,56,000 నగదుతో పాటు ఒప్పో ఏ 15 సెల్ఫోన్, రెండు తులాల వెండి మొలతాడు దొంగిలించినట్టు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే జరిగిన చోరీ పై పోలీసులు జాగిలం స్క్వాడ్ తో విచారణ చేపట్టగా మండల కేంద్రంలోని బాధిత కుటుంబీకుల ఇంటి నుంచి డాగ్ స్క్వాడ్ జాగిలం నేరుగా వెళ్లి మండల కేంద్రం లోని వైన్స్ దగ్గర డాగ్ స్క్వాడ్ జాగిలం ఆగింది. ఈ దొంగతనంపై పోలీసులు ఆధారాలు సేకరించి విచారణ చేపట్టారు. దొంగలను పట్టుకునే పనిలో స్థానిక పోలీసులతో పాటు ఫింగర్ ప్రింట్ ఐటి కోర్ సిబ్బంది నిమగ్నమై ఉన్నారు.

వరి ధాన్యం తో వెళ్తున్న లారీ మైతాపూర్ వద్ద బోల్తా

రాయికల్ మే 21 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ వద్ద మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సమయంలో వరి ధాన్యం లోడ్ తో వెళ్తు అదుపు తప్పి లారీ బోల్తాపడింది. వరి ధాన్యం కేంద్రం నుంచి లోడ్ చేసుకొని వస్తున్న సమయంలో అధిక లోడు కావడం తో లారీ బోల్తా, పడింది దీంతో వరి ధాన్యం బస్తాలు నేలపాలు కాగా లారీ లో ఉన్న ఎవరికి ఏమి కాలేదు.

అధికారులూ..తస్మాత్ జాగ్రత్త

అతిగా చేస్తే అడ్డంగా బుక్ అవుతారు: బోండా

అమరావతి,మే21: సీఎం జగన్ కోసం చట్టాన్ని అతిక్రమిస్తే జైలు పాలయ్యేది అధికారులేనని తెదేపా నేత బొండా ఉమ హెచ్చరించారు. అధికారులు ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అతిగా చేస్తే తరవారి పరిణామాలకు బాధ్యులు కాగలరని అన్నారు. మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిట్ నివేదికను డీజీపీ వెంటనే బయటపెట్టాలి. తెదేపా నేతలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి. రాష్ట్రంలో రక్తపాతం సృష్టించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పిన్నెల్లి సోదరులు, భూమన కరుణాకర్ రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి. సస్పెండ్ అయిన అధికారుల కాల్ డేటాను బయటకు తీయాలి. అరాచకం సృష్టించిన నేతల కాల్ డేటాను బయటకు తీసి అరెస్టు చేయాలి. వైకాపా నేతల ఇళ్లలో బాంబులు, వేట కొడవళ్లు దొరికినా కేసులు నమోదు చేయకపోవడం దారుణం. ఆ పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బొండా ఉమ డిమాండ్ చేశారు.

బిబికే వాలీబాల్ కప్ విజేత భీంరాజ్ పల్లి ఫ్రెండ్లీ మ్యాచ్

- విన్నర్ గా నిలిచిన బొమ్మన ఆకాష్ టీం

- రన్నర్ గా నిలిచిన పాట్ట తిరుపతి టీం - ఫ్రెండ్లీ సిరీస్ విన్నర్ సామల సాగర్

గొల్లపల్లి మే 21 (ప్రజామంటలు): మండలంలోని భీమ్రాజు పల్లి గ్రామంలో భీమ్రాజు పల్లి బొమ్మన కుమార్ వాలీబాల్ టోర్నమెంటు (బిబికే) సోమవారం రాత్రి నిర్వాకులు బొమ్మన కుమార్ ప్రారంభించారు. కీ.శే. ఎరసాని రాజయ్య జ్ఞాపకార్థంగా క్రికెట్ టోర్నమెంటు బొమ్మన కుమార్ నిర్వహించారు. ఫ్రెండ్లీ మ్యాచ్లో పొట్ట తిరుపతి, దూస రహుల్, బొమ్మన ఆకాష్, కళ్ళెం చందు టీమ్లు వాలీబాల్ ఆడారు . విన్నర్ గా బొమ్మన ఆకాష్ టీం గెలుపొందారు. రన్నర్ గా పొట్ట తిరుపతి నిలిచారు. ఫ్రెండ్లీ మ్యాచ్ సిరీస్ విన్నర్ గా సామల సాగర్ టీం గెలుపొందారు. ఈ ఆటల్లో గెలుపొందిన బొమ్మన ఆకాష్ టీంకు ట్రోఫీ తో పాటు, రూపాయలు రూ. 2000 ప్రైజ్ మనీ,ఫ్రెండ్లీ మ్యాచ్ సిరీస్ విన్నర్ సామల సాగర్ టీంకు రూ. 1000 ప్రైజ్ మనీ బి బి కే కప్ స్పాన్సర్, బొమ్మన కుమార్ వాలీబాల్ టోర్నమెంట్ (బిబికే) కప్పు ట్రోఫీ ని స్పాన్సర్ బొమ్మన కుమార్, ముక్తామని, చేతుల మీదుగా విజేతలకు

అందజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మన నరేందర్, బొమ్మన వెంకటేశం, కంది స్వామి, సింగారపు లచ్చయ్య,మహేష్, సాగర్, ఆర్ ఆర్ డి డిజిటల్ రేవెల్ల రమేష్, సామల రవి, కంది వెంకటేశం, దూస శ్రీనివాస్, పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ పండుగ

అమ్మవారిని దర్శించుకున్న మాజీ సర్పంచ్ మల్లికార్జున్

వేలేర్ మే 20 (ప్రజామంటలు): వేలేరు మండలకేంఁదంలో రేణుక ఎల్లమ్మ పండుగ సందర్భంగా గౌడ సంఘ పెద్దమనుషులతో కలిసి వేలేరు మండల మాజీ సర్పంచ్ విజయపూరి మల్లికార్జున్ గారు ఈ రోజు అమ్మవారి దర్శించుకొని టెంకాయ సమర్పించి వేలేరుఁపజలంతా సుఖసంతోషాలతోటి ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యకమంలో వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి సంపత్, సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్, బైరి శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, బైరి కుమార్, వడ్లకొండ రమేష్, చిరంజీవి, సతీష్ కడియం యువసేన మండల అధ్యక్షులు పిండి అనుదీప్ పాల్గొన్నారు.

పల్నాడులో పక్కాగా హిసకు ప్లాన్

మాజీ ఎంపి కనకమేడల ఆరోపణ

న్యూఢిల్లీ,మే21: పల్నాడులో హింసకు ముందునుంచీ వైసిపి ప్రణాళికలతో ఉందని తెదేపా సీనియర్ నేత కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. గత ఘటనలు ముందేసుకుంటే వారి నైజం బయటపడుతుందన్నారు. గతంలో మాచర్లలో నడిరోడ్డుపై తెదేపా కార్యకర్త గొంతుకోసి చంపారని రవీంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందే 100 హింసాత్మక ఘటనలు జరిగాయని మండిపడ్డారు. గత రెండేళ్లుగా మాచర్లలో వైకాపా హింస కొనసాగుతున్నా.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తప్పనిసరి కేసులు నమోదు చేయాల్సి వస్తే నామమాత్రపు కేసులు పెట్టారని ఆక్షేపించారు. సీఎస్ జవహర్‌రెడ్డి, అప్పటి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఇంటెలిజెన్స్ అధికారి సీతారామాంజనేయులు కనుసన్నల్లో దాడులు జరిగాయన్నారు. సిట్ లోతుగా దర్యాప్తు చేసి అసలు కుట్రదారులను బయటపెట్టి కటకటాల్లోకి పంపాలని కనక మేడల డిమాండ్ చేశారు.

హుస్నాబాద్‌లో రైతన్న కోసం బిజెపి రణభేరి దీక్ష

హుస్నాబాద్ మే 21 (ప్రజామంటలు): బిజెపి జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ కుమార్ ఆదేశానుసారంగా రైతు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంకు తెలియజేసేందుకు బిజెపి నేతృత్వంలో గత మూడు రోజులుగా వినూత్న కార్యక్రమాలతో రైతు కల్లాలను క్షేత్రస్థాయిలో సందర్శిండం వాటి వివరాలతో కూడిన దరఖాస్తులు తహిసిల్దార్ లకు అందజేయడం, పత్రిక సమావేశాల ద్వారా ప్రభుత్వ యంత్రాంగానికి తెలియజెప్పడం నేడు రైతుకోసం రణభేరి దీక్షలు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు స్వీకారం చుట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో రైతన్న కోసం బిజెపి రణభేరి దీక్ష బిజెపి నియోజకవర్గ స్థాయి నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి నేతృత్వంలో వెంకటేశ్వర గార్డెన్ లో జరిగింది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.... రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి

లేకపోవడం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం మూలన బిజెపి నేతృత్వంలో రైతు సమస్యలపై పోరాటాలు సాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు వారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేందుకు రైతు పండించిన ధాన్యానికి 500 బోనస్ ఇప్పించాలని రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని రైతు బరోసా క్రింద 15 వేలు అందించాలని రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు త్వరగా చేయాలని బిజెపి నేతృత్వంలో గత నాలుగు రోజులుగా వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేస్తూ నేడు నియోజకవర్గ కేంద్రంలో దీక్ష చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ పట్టణ, మండల, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, బిమాదేవరపల్లి బిజెపి మండలాల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, వెల్దండి రాజేంద్రప్రసాద్, రామంచ మహేందర్ రెడ్డి, ఖమ్మం వేంకటేశం, పైడిపల్లి శ్రీనివాస్, పైడిపల్లి పృద్వీరాజ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల,మాజీ జిల్లా అధికారప్రతినిధి గుత్తికొండ విద్యాసాగర్, హుస్నాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శులు చందు, లక్ష్మణ్, పట్టణ ఉపాధ్యక్షులు సమయ్య, మహేష్కర్, రాంప్రసాద్, నాగార్జున, ప్రశాంత్, వెలదండి సంతోష్, అనంతస్వామి, వడేపల్లి లక్ష్మయ్య, పోగుల శేఖర్, రాంరెడ్డి, సాయికృష్ణ, భూశంకర్, వివిధ మండలాల పార్టీ ప్రధాన కార్యదర్శులు వివిధ బాధ్యతల్లో ఉన్న పార్టీ శ్రేణులు రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు కోసం

జడ్పిటిసి చాడ సరిత ప్రచారం

వేలేర్ మే 20 (ప్రజామంటలు): వేలేరు మండల కేంద్రంలో వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మరిజే మర్సింగా రావు మరియు క్లస్టర్ ఇన్చార్జి జడ్పిటిసి చాడ సరిత విజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్స్ ఇన్చార్జిలతో కలిసి చొప్పదండి మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సుంకె రవిశంకర్ స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య ల ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని, ప్రశ్నించే గొంతుకను చట్టసభకి పంపాలని ఓటర్లకు వివరిస్తూ...వేలేరు లోని 192 గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా 25 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లకు గాను ఒక ఇన్ఛార్జ్ ని నియమించుకుని అందుబాటులోఉన్నా వారిని కలిసి బిఆర్ఎస్ అభ్యర్థికి ఓటువేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బత్తుల జ్యోతి సోషల్ మీడియా ఇంచార్జ్ జోగు ప్రసాద్, సూత్రపు సంపత్, అశోక్, కిరణ్ పాల్, రమేష్, రజాక్, మాజీ సర్పంచ్ కరుణాకర్, సంపత్, భూపతి రాజు, బూత్ ఇన్చార్జిలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఎబివిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

సిపిఐ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

అమరావతి,మే21: సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్య దర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏబీ వెంకటేశ్వరరావుపై జగన్ ప్రభుత్వం పగబట్టిందని, ఆయనను సస్పెండ్ చేసి పలు రకాలుగా వేధింపులకు గురిచేసిందని అన్నారు. ఆయనపై సస్పెన్షన్ చెల్లదని, ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్(క్యాట్) ఆదేశాలిచ్చి 12 రోజులు దాటినా ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అడ్డంకులు సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని తెలిపారు. అధికారుల మధ్య కూడా ఫ్యాక్షనిస్టుల మాదిరి కక్షలు సరికాదని, ఏబీవీ పట్ల కక్షపూరిత వైఖరిని విడనాడాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏబీ వెంకటేశ్వరరావు ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేస్తున్నందున ఆయనకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

జూడాల సమ్మెతో ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

గాంధీ సూపరింటెండెంట్ రాజారావు

సికింద్రాబాద్ మే 21 (ప్రజామంటలు): నేటి నుంచి జూడాలు చేస్తున్న సమ్మెతో గాంధీ ఆసుపత్రి పేషంట్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు తెలిపారు. గాంధీ ఆసుపత్రిలో దాదాపు 500కి పైగా పీజీ వైద్యులున్నారని, వీరంతా సమ్మెకు వెళ్ళ న్నందున, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే పలువురు డాక్టర్లకు ఇచ్చిన సెలవులను రద్దు చేశామన్నారు.

అత్యవసర వైద్యం పొందుతున్న పేషంట్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

డా. కరిష్మి, గాంధీ జూడా యూనిట్ అడ్వయిజరీ కమిటీ

మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22 నుంచి జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తున్నాం. మా సమ్మె నోటిస్ కు స్పందించి ప్రభుత్వం మా స్టైఫండ్ ఏరియర్స్ సోమవారం ఇచ్చింది. కాని మిగితా డిమాండ్లను పరిష్కరించేంతవరకు మా సమ్మె కొనసాగిస్తాం. మా స్టైఫండ్ ను జాప్యం చేయకుండా రెగ్యులర్ గా సమయానికి ఇవ్వాలి, సూపర్ స్పెషాలిటి సీనియర్ రెసిడెంట్లకు హనోరియమ్ ఇవ్వాలి, మెడికల్ ఎడ్యుకేషన్ లో ఏపీ లో తెలంగాణ స్టూడెంట్స్ కు 15 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి. పలు కాలేజీల్లో సెక్యూరిటీ, హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి.

జగిత్యాల లో ఘనంగా నృసింహ జయంతి వేడుకలు

జగిత్యాల మే21 (ప్రజా మంటలు)

పట్టణంలోని పురాణిపేట లో శ్రీ లక్ష్మీనృసింహ ఆలయంలో నృసింహ జయంతి సందర్భంగా స్వామి వార్లకు ఆలయ ప్రధానార్చకులు పూర్ణానంద చార్యులు పానకాభిషేకం తో పాటు ప్రత్యేక అభిషేకాలు ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, స్వామి వారి ప్రసాదంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

శాంతి కళ్యాణం తో ముగిసిన మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి, శ్రీ శారదా

చంద్రమౌళీశ్వర రుద్రసేవ పరిషత్ 18వ వార్షికోత్సవ వేడుకలు

జమ్మూ కాట్రా మే 21 (ప్రజా మంటలు)
మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి, శ్రీ శారదా చంద్రమౌళీశ్వర రుద్రసేవ పరిషత్ 18వ వార్షికోత్సవ వేడుకలు జమ్ములోని (కాట్రా)ప్రాంతంలో ఈనెల 17 నుండి కొనసాగుతుండగా మంగళవారం శ్రీ గణపతి, మహాలక్ష్మి, సుదర్శన, రుద్ర సహిత శత చండీయాగము ,మహా పూర్ణాహుతి మరియు శాంతి కళ్యాణము, కుంకుమార్చనలతో ఘనంగా ముగిశాయి. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి సేవ పరిషత్తు సభ్యులు, బాధ్యులు ,భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైదిక క్రతువులు మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి కార్యనిర్వక సభ్యులు తదితరులచే నిర్వహించబడినది. వార్షికోత్సవంలో భాగంగా సాంస్కృతిక ,సాహిత్య కార్యక్రమాలు, భజనలు, ప్రతినిత్యం స్థాపిత దేవత ఆరాధన, మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకం , నిత్య హోమాలు నిర్వహించారు. చివరి రోజైన మంగళవారం వైదిక క్రతవుల్లో భాగంగా బలి ప్రధానము, కలుషోద్వాసనము, అవబృత స్నానము, కుంభ ప్రోక్షణ, మహదాశీర్వచనము, ఆచార్య, ఋత్విక్ సన్మానము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సేవా సమితి అధ్యక్షులు దోర్భల. కృష్ణమూర్తి శర్మ, ప్రధాన కార్యదర్శి ఘనపురం. రాంప్రసాద్ శర్మ, కోశాధికారి మహాదేవభట్ల. లక్ష్మణ ప్రసాద్ శర్మ, ఉపాధ్యక్షులు వడిగచర్ల. విష్ణుమూర్తి శర్మ, జోషి. రమేష్, మహదేవ్ భట్ల. దిలీప్ కుమార్ శర్మ, చలివేంద్రి. భవాని, సంయుక్త కార్యదర్శి జోషి. సత్యనారా యణరావు, రాజనాల. వెంకటేశ్వర శర్మ, యలమంచి. చంద్రశేఖర్ శర్మ, కశోజ్జల. త్రివేణి, కార్యనిర్వాహక కార్యదర్శి సిరిసిల్ల. రాంప్రసాద్ శర్మ, వైదిక కార్యదర్శులు కొడకండ్ల. రాధాకృష్ణశర్మ, కూచి. వంశీ కృష్ణ శర్మ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుమదునూరి. మహాదేవ శర్మ, విఠల.మురళీధర శర్మ, శ్రవ ణ్ కుమారాచార్యులు, గోళ్ళ. గోవర్ధన్ శర్మ ,నిమ్మ రాజు. చంద్రశేఖర్ శర్మ, దోమడాల. విశ్వనాథరావు, ముఖ్య సలహాదారులు నెమ్మాని. విష్ణుమూర్తిశర్మ, డా. తుమ్మూరి. లక్ష్మణరావు దామెర. సత్యనారాయణ శర్మ, యలమంచి విఠలేశ్వర శర్మలు మరియు సమస్త సభ్యులు దాతల సహకారం చే వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు సేవా పరిషత్ అధ్యక్షులు తెలిపారు.

జిల్లా అధికారులతో రైస్ మిల్లర్లతో పాడి ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ తో కలెక్టర్ సమావేశం

జగిత్యాల మే 21(ప్రజా మంటలు)
మంగళవారం రోజున జిల్లా కలెక్టర్, జగిత్యాల సమావేశ మందిరంలో జిల్లా సమీకృత కార్యాలయములో వరిధాన్యం కొనుగోలు విషయములో జిల్లా అధికారులతో, రైస్ మిల్లెర్స్ మరియు పాడి ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్స్ తో సమీక్షా సమావేశము నిర్వహించినారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అకాల వర్షాలు కురుస్తున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రాగల వారం రోజులలో అన్నీ కొనుగోలు కేంద్రాలలో గల మొత్తం ధాన్యం వెనువెంటనే తూకం వేసి, కొనుగోలు చేసిన ధాన్యం సంచులని టార్పాలిన్లు తో కప్పి ఉంచాలని మరియు సెంటర్ ఇంచార్జీ లకు తగు సూచనలు జారీ చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మరియు జిల్లా సహకార

శాఖ అధికారి గార్లను ఆదేశించినారు.సివిల్ సప్లయ్ క్షేత్ర స్థాయ సిబ్బందిలను ఉద్దేశించి జిల్లాలో గల అన్నీ రైస్ మిల్లులలో నిలిపి ఉన్న లారీలను వెంటనే దిగుమతి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించినారు. అదేవిధంగా లారి ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను సివిల్ సప్లయ్ క్షేత్ర స్థాయ సిబ్బందితో సమన్వయం చేసుకొని దిగుమతి అయిన లారీలను వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించి ధాన్యం రవాణా అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అన్నీ రైస్ మిల్లులలో ధాన్యం దిగుమతి లో ఎలాంటి జాప్యం జరగకుండా ఎక్కువ మొత్తంలో హమాలీలను ఏర్పాటు చేసుకొని ఒక్కో రైస్ మిల్లులో రోజు కి కనీసం 10 నుండి 15 లారీల ధాన్యం దిగుమతి అయ్యేలా చర్యలు చేపట్టాలని రైస్ మిల్లర్లకు ఆదేశాలు జారీచేశారు.ఇట్టి సమావేశములో జిల్లా కలెక్టర్ , అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి , జిల్లా మేనేజర్ పౌరసరఫరా సంస్థ , జిల్లా సహకార శాఖ అధికారి , జిల్లా వ్యవసాయ అధికారి, ఆర్ టి ఓ, జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్, జిల్లా లారి ట్రాన్స్ పోర్ట్ (ప్రతినిధులు) మరియు పౌరసరఫరాల శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేన్స్ చిత్రోత్సవం... ఓ మరువలేని అనుభూతి

నటి కియారా అద్వానీ వెల్లడి

'కేన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొనడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తానని బాలీవుడ్ నాయిక కియారా అద్వాణీ అన్నారు. తనదైన నటనతో మెప్పించే ఈ భామ.. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవాల్లో మెరిసి సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన 'ఉమెన్ ఇన్ సినిమా' అంశంపై జరిగిన చర్చా వేదికలో పాల్గొంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వేడుకలోని తన అనుభవాలు, రాబోయే ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తిర విషయాలను కియార పంచుకుంది. కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవ్వడం సంతోషంగా ఉంది. నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లోనే ఎంతో మధురమైన జ్ఞాపకంగా ఉండిపోతుంది. దాదాపు 20ఏళ్ల క్రితం నా కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకకు హాజరయ్యాను. చిన్నప్పుడు దీని గురించి ఇంటర్నెట్ ద్వారా తెలుసుకునేదాన్ని. కానీ.. నేను ఒక సెలబ్రెటీగా ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేడుకలో పాల్గొంటానని ఆ సమయంలో నాకు తెలీదు. కేన్స్ చిత్రోత్సవం నాకు ఎప్పటికీ మర్చిపోలేని ఒక అనుభవం' అంటూ ఆనందం వ్యక్తం చేసింది. యాక్షన్ చిత్రాల్లో నటించడానికి చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. 'వార్ 2', 'డాన్ 3'లతో ఆ కోరిక నెరవేరబోతుంది. ఇవి నా కెరీర్‌లోనే పెద్ద ప్రాజెక్టులు. ప్రేమకథలు, కామెడీ..ఇలా అన్ని జానర్లలో పనిచేశాను. కానీ చాలా కాలంగా పూర్తిగా యాక్షన్ నేపథ్యంలో సాగే చిత్రాల్లో నటించడం కోసం వేచి చూస్తున్నాను. ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. ఒకానొక సమయంలో 'షేర్షా' సినిమాలో నేను భాగమైనప్పుడు.. 'ఓ మై గాడ్ ఇదొక యుద్ధానికి సంబంధించిన యాక్షన్ చిత్రం. ఇలాంటి ప్రాజెక్టులో ఈమె నటిస్తుందా..?' అని కొంతమంది నా మీద విమర్శలు చేశారు. కానీ.. ప్రస్తుతం భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న రెండు పెద్ద ప్రాజెక్టులు నా చేతుల్లో ఉన్నాయి. ఈ సినిమాల్లో నన్ను నేను నిరూపించుకోవడమే ముఖ్యం అని తెలిపింది.



సల్లంగా సూడు ఎల్లవ్వ తల్లి

ఘనంగా ముల్కనూర్ లో బోనాల వేడుకలు

భీమదేవరపల్లి మే 21 (ప్రజామంటలు) :
మండలంలోని ముల్కనూర్ గ్రామంలో మంగళవారం గ్రామ దేవత ఎల్లమ్మ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. హై స్కూల్ గ్రౌండ్ నుండి మహిళలు బోనాలు ఎత్తుకుని, డప్పు చప్పులతో ఎల్లమ్మ తల్లి దేవాలయం వరకు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు.అనంతరం మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లవ్వ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో సుఖ, సంతోషాలతో ఉండాలని, తమను సల్లంగ చూడు తల్లి అంటూ వేడుకున్నారు.

ఈ కార్యక్రమంలో యువతులు, చిన్నారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గం.. గం.. గణెశా'తో వస్తోన్న ఆనంద్ దేవరకొండ

31న విడుదల కానున్న చిత్రం

'గం.. గం.. గణెశా'తో ఆనంద్ దేవరకొండ థియేటర్లలో సందడి చేయనున్నారు . ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ఉదయ్ శెట్టి తెరకెక్కించారు. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి సంయు క్తంగా నిర్మించారు. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు వంశీ పైడిపల్లి, రచయిత విజయేంద్ర ప్రసాద్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేందప్రసాద్ మాట్లాడుతూ.. 'దర్శకుడు ఉదయ్ నా దగ్గర పని చేశాడు. అంకిత భావం, కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి. ఈ సినిమా తప్పకుండా విజయవంతమవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. బేబి' ట్రైలర్ జులైలో విడుదల చేశాం. అప్పుడు వర్షం పడింది. ఇప్పుడు మేలో

ఈ ట్రైలర్ విడుదల చేశాం. ఇప్పుడూ వర్షం పడింది. 'బేబి'లాగే ఈ సినిమాతోనూ ఆనంద్‌కు విజయం దక్కాలని కోరుకుంటున్నా' అన్నారు దర్శకుడు వంశీ పైడిపల్లి. హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. 'తొలిసారి ఈ సినిమాలో ఓ హుషారైన విభిన్నమైన పాత్ర పోషించా. భయం, అత్యాస, కుట్ర అనే అంశాల్ని కేంద్రంగా చేసుకుని అల్లుకున్న క్రైమ్ కామెడీ ఇది. చిత్రసీమలో ఎవరైనా ఏదైనా సాధిస్తే కొన్ని గ్రూప్స్ మాత్రమే సెలబ్రేట్ చేస్తున్నాయి. అది సరికాదు. మనమంతా మన ఇండస్ట్రీ వాళ్లు సాధించే విజయాల్ని వేడుక చేసుకోవాలి' అన్నారు. 'వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమా రూపొందించాం. వినోదాత్మకంగా ఉంటూనే ట్విస్ట్‌లు థ్రిల్ పంచుతాయి' అన్నారు దర్శకుడు ఉదయ్. కార్యక్రమంలో సాయి రాజేశ్, సారిక, కేదార్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

జెమినీలో రామాయణం సీరియల్

27 నుంచే ప్రారంభిస్తున్నట్లు వెల్లడి

పురాణాలలో 'రామాయణం' కి వున్నా వైశిష్ట్యం చాలాగొప్పది ఎందుకంటే శ్రీ మహావిష్ణువు మానవుడిగా జన్మించి ఎలా మసలుకోవాలి, ఎటువంటి ధర్మాలు పాటించాలి, ఎంతటి కష్టమొచ్చినా ధర్మాన్ని విడవకుండా ఎలా జీవనం సాగించాలి అని రాముని పాత్రలో చాటి చెప్పాడు. వాల్మీకి రచించిన ఈ రామాయణం ఎన్నిసార్లు విన్నా, చూసినా తనివి తీరదు అని చెపుతూ వుంటారు. రామరాజ్యం అన్న మాట రాముడు పరిపాలించిన తీరును బట్టి వచ్చింది. తండ్రి మాటకి కట్టుబడి, తండ్రిని ధర్మపథంలో నిలబెట్టడానికి అడవికి వెళ్లిన రాముడు, తండ్రి మాటని జవదాటని కొడుకుగా, ఏకపత్నీవ్రతుడిగా, ప్రజల క్షేమం కోసం ధర్మం తప్పని రాజుగా, అందరికి ఆదర్శంగా నిలిచిన శ్రీరామగాథను ఎన్ని సార్లు చూసినా తనివి తీరదు.అటువంటి రాముని చరిత్ర 'రామాయణం' మరోసారి తెలుగులో టీవిలో ప్రసారం కానుంది. ఇంతకీ ఈ రామాయణం సీరియల్ ఎక్కడ ప్రసారం అవుతోంది, ఎప్పటి నుండి కానుంది అంటే, ఈ నెల 27వ తేదీ నుండే. జెమిని టివిలో మే 27వ తేదీ సోమవారం సాయంత్రం గం. 6.30 లకు ఈ దృశ్యకావ్యం 'శ్రీమద్ రామాయణం' సీరియల్ ప్రసారం కానుంది అని నిర్వాహకులు చెపుతున్నారు. శ్రీ మధ్ రామాయణం'. ఈ సీరియల్ లో శ్రీరాముని అవతార విశిష్టత, జన్మ వృత్తాంతం, లంకాధిపతి అయిన రావణాసురుడి జన్మ వృత్తాంతం మొదలుకుని రామాయణంలోని అన్ని ఘట్టాలను

కనులకు కట్టినట్లుగా అద్భుతమైన సాంకేతిక విలువలతో అత్యద్భుతంగా చిత్రీకరించి శ్రీ రామ గాథను జెమిని టివి అభిమాన ప్రేక్షకులందరికి ఎప్పటికి గుర్తుంది పోయేలా అందించడం జరుగుతోంది అని చెపుతున్నారు.శ్రీ వాల్మీకి విరచిత రామాయణం 'శ్రీమద్ రామాయణం' గా సూపర్ గ్రాఫిక్ టెక్నాలజీతో, అనుభవజ్ఞులైన నటీనటుల నటనతో, మనుసుని ఆకట్టుకునే మాటలతో, ప్రతి తెలుగు ప్రేక్షకుడిని అలరించడానికి మే 27వ తేదినుండి సోమవారం నుండి శనివారం వరకు, ప్రతి రోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలనుండి 7 గంట 30 నిమిషాల వరకు ప్రసారం కానుంది.

సుధీర్ బాబు హరోంహర విడుదల వాయిదా

సింగిల్ స్క్రీన్ సినిమా హాల్స్ కొన్ని రోజులపాటు మూసి వేస్తున్నామంటూ ఒక పక్క ప్రకటనలు వస్తుంటే, ఇంకో పక్క, సుమారు ఒక అరడజను సినిమాలు మే 31న విడుదల చేస్తున్నామంటూ ప్రకటించారు. ఆలా ప్రకటించిన వాటిలో సుధీర్ బాబు నటించిన 'హరోం హర' సినిమా కూడా వుంది. జ్ఞానశేఖర్ ద్వారక ఈ చిత్రానికి దర్శకుడు, మాళవిక శర్మ కథానాయికగా నటించింది. సునీల్ ఒక ముఖ్య పాత్రలో నటించారు. చిత్తూరు నేపథ్యంలో జరిగిన ఒక పీరియడ్ డ్రామా ఇది. సుధీర్ బాబు, తన మామయ్య కృష్ణ గారి పుట్టినరోజు అయిన మే 31 సందర్భంగా ఈ సినిమా విడుదల చేద్దామని ముందుగా అనుకున్నారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి విడుదల చెయ్యలేకపోతున్నామని, జూన్ 14 కి విడుదల వాయిదా వేశామని చెపుతున్నారు. మే 31 మిస్ అయినందుకు ఒక పక్క బాధగా వున్నా, జూన్ నెలలో విడుదల చేస్తున్నందుకు తనకి బాగా కలిసి వచ్చిన నెల అది అని చెపుతున్నారు సుధీర్ బాబు. ఎందుకంటే తన

సినిమాలు 'సమ్మోహనం', 'ప్రేమ కథా చిత్రం' ఈ జూన్ నెలలోనే విడుదలై మంచి విజయాలు సాధించాయని చెపుతున్నారు. ఇప్పుడు ఈ 'హరోం హర' కూడా ఈ జూన్ 14న విడుదలై తనకి మంచి విజయాన్ని అందిస్తుందని ఆశిస్తున్నట్టుగా చెపుతున్నారు సుధీర్ బాబు. ఈ సినిమాలో సుధీర్ బాబు చిత్తూర్ యాసలో తన మాటలు చెపుతారని, ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకున్నట్టుగా తెలుస్తోంది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com